ఈనాడు
కాకినాడ
మంగళవారం అక్టోబరు 8, 2024



కరుణించమ్మా మహాలక్ష్మమ్మ

పిఠాపురం: దసరా ఉత్సవాలలో భాగంగా పిఠాపురంలో మహాలక్ష్మి అమ్మవారిని ఇంద్రాణిగా అలంకరించారు..

భూ సమస్యకు పరిష్కారం

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీ

ఈనాడు, కాకినాడ: వైకాపా సర్కారులో అన్యాక్రాంతమైన భూమి.. కూటమి ప్రభుత్వం వచ్చాక దక్కిందని కాకినాడకు చెందిన వ్యాపారి చలికి వీరేంద్ర ఆనందం వ్యక్తంచేశారు. మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్‌లో తన భూమి సమస్య పరిష్కారమైందంటూ కృతజ్ఞతలు తెలుపుతూ భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ కలెక్టరేట్‌లో భూదస్త్రాలు దిద్దేసి.. చీడీలపొరలో వీరేంద్రకు చెందిన ఎకరం భూమిని ఆక్రమించడం సంచలనం కలిగించింది. తన భూమిలో తాను షెడ్డు కడుతుంటే చంపేస్తామని బెదిరించారని.. కలెక్టరేట్‌లోని రికార్డులు ట్యాంపరింగ్ చేసి, యజమాని పేరు మార్చేసి తిరిగి తమ పైనే కేసులు పెట్టిస్తున్నారని వీరేంద్ర నాడు ఆరోపించారు. అధికారులు పట్టించుకోలేదు. లోకేశ్ యువగళం పాదయాత్ర, ప్రజా దర్బార్‌లో వీరేంద్ర ఫిర్యాదుచేశారు. సానుకూల స్పందన రావడంతో ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకున్న వీరేంద్ర.. ఆ స్థలంలో ఇలా ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు.



కాకినాడ చీడీలపొరలోని భూమి వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

ఉమ్మడి జిల్లా మీదుగా సాగే ప్రైవేటు బస్సులు	ఆలిండియా పర్మిట్ ట్రావెల్స్	దూర ప్రాంతాలవి	ఇతర ప్రాంత సర్వీసులు
	61	30	80


ఉమ్మడి తూర్పులో ఇలా..	ఆర్టీసీ డిపోలు	బస్ స్టేషన్లు	బస్సుల సంఖ్య	పండగ వేళ రద్దీ సుమారు
	11	44	901	10 లక్షలు

పండగ వేళ.. వీరబాదుడు

ఆర్టీసీలో సాధారణం.. ప్రైవేటులో అధిక భారం

ఈనాడు, కాకినాడ

కాకినాడ నుంచి వివిధ ప్రాంతాలకు ఛార్జీలిలా..



దసరా సెలవుల వేళ స్వస్థలాల్లో పండగ చేసుకోవడానికి రాకపోకలు ఊపందుకున్నాయి. ఓ ప్రణాళిక ప్రకారం ముందుగానే రిజర్వేషన్లు చేసుకున్నవారు కొందరైతే.. ఇంకొందరు అప్పటికప్పుడు సిద్ధమవుతున్నారు. ఆర్టీసీ సాధారణ ఛార్జీలే వసూలు చేస్తుండగా ప్రైవేటు బస్సుల్లో బాదుడు తప్పడంలేదు. డిమాండ్ ఆధారంగా ధరలు పెంచేస్తున్నారు. పండగ అటు ఇటు రోజుల పరిస్థితి చూస్తే టికెట్టా.. రాకెట్టా.. ? అన్నంతగా ఉంది.



కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి దూర ప్రాంతాలకు పండగ వేళల్లో లక్షల మంది వెళ్తారు. ఉపాధి, ఉద్యోగరీత్యా ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల్లో ఉన్నవారు సైతం ఇక్కడికి పెద్ద ఎత్తున వస్తుంటారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, రావులపాలెం, తుని, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, యానాం నుంచి ప్రైవేటు బస్సులు దూరప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖ, శ్రీకాకుళం ప్రాంతాలకు ప్రైవేటు ట్రావెల్స్ సేవలు ఉన్నాయి. తాకిడి ఆధారంగా ధరలు పెంచేస్తున్నారు.

నిఘా ఎక్కడుంది?

■ ఉమ్మడి జిల్లాలో రవాణాశాఖ చెక్‌పోస్టు గతంలో తుని మండలం తేటగుంట వద్ద ఉండేది.. వైకాపా వచ్చాక బెండపూడి ప్రాంతానికి మార్చారు. ఎన్నికలకు ముందు దీంతోపాటు రాష్ట్రంలోని 18 చెక్‌పోస్టులూ ఎత్తేశారు. వాహనాలపై నిఘా ఉంచామని అధికారులు చెబుతున్నా.. ప్రత్యేక డ్రైవ్‌లు, తనిఖీలు లేవు. ఈ పరిస్థితుల్లో ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపైకి వచ్చే ప్రమాదమూ ఉంది. పండగ రోజుల్లో అధిక ఛార్జీల వసూళ్లతోపాటు.. ప్రయాణికుల భద్రతపైనా దృష్టిసారించడం మేలు.

అతిక్రమిస్తే చర్యలు



సాధారణ రోజులతో పాటు.. పండగ సీజన్ లోనూ వాహనాలు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెడతాం. ఉమ్మడి జిల్లాలోని చెక్‌పోస్టు ఎత్తివేసినా.. కీలక మార్గాల్లో నిఘా ఉంది. ఆన్‌లైన్‌లో, క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధిక ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీధర్, ఉప కమిషనర్, రవాణాశాఖ, కాకినాడ జిల్లా

సత్యదేవుని ప్రసాదానికి విజయ నెయ్యి

అన్నవరం: అన్నవరం సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం తయారీకి విజయవాడలోని విజయ డెయిరీ నెయ్యి వినియోగించనున్నారు. ఆలయాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకు సరఫరా చేసే గుత్తేదారు గడువు సెప్టెంబరు 30తో ముగియడంతో కొత్తవారికి ఇంకా అనుమతి ఇవ్వలేదు. దేవాదాయశాఖ మార్గదర్శకాలు వచ్చే వరకు తాత్కాలికంగా విజయ నెయ్యి తీసుకుంటారు. ముందుగా 300 డబ్బాల నెయ్యి (4,500 కేజీలు) అన్నవరానికి వచ్చింది. మరో 150 డబ్బాల నెయ్యి అన్నవరం రానున్నట్లు తెలిసింది. దేవాదాయశాఖ నుంచి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో ఎక్కడినుంచి కొనుగోలు చేయాలో తుది నిర్ణయం తీసుకుంటారు.

రేపు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాపవరం రానున్న మంత్రి మనోహర్

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 9న కొవ్వూరు మండలం కాపవరం వస్తున్నారు. అక్కడి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సాయంత్రం 4 గంటలకు ఆయన ప్రారంభిస్తారని ఆ శాఖ జిల్లా మేనేజర్ టి.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొంటారన్నారు.

అడిగేదెవరు.. ఇలానే వదిలేస్తాం


వాకలపూడి పారిశ్రామికవాడలోని పరిశ్రమల నుంచి వస్తున్న రసాయనాలు


ఫిషింగ్ హార్బర్‌పేట వద్ద సముద్రంలో కలుస్తూ...

నిబంధనల ప్రకారం పరిశ్రమల నుంచి వదిలే వ్యర్థ జలాలను శుద్ధి చేసి బయటకు పంపించాలి. అయితే కాకినాడ వాకలపూడి పారిశ్రామికవాడలో కొన్ని పరిశ్రమలు విషతుల్యమైన రసాయనాలను విచ్చలవిడిగా వదిలేస్తున్నాయి.. దీంతో పరిసర ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకోగా.. అదే రసాయనాలు చివరకు సముద్రంలో కలుస్తున్నాయి.. ఈ కారణంగా సముద్రంలో జీవరాశిపై తీవ్ర ప్రభావం పడుతోంది.. మత్స్య సంపద తగ్గిపోయి మత్స్యకారులకు జీవనోపాధి కరవవుతోంది.. మరోవైపు ప్రజలు సముద్రంలో దొరికే చేపలు తిని రోగాలపాలవుతున్నారు.. కాలుష్య నియంత్రణ అధికారులు చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది.

- ఈనాడు, కాకినాడ

తెలుగు వికాసానికి అడుగులు

● చారిత్రక నగరిలో విశ్వవిద్యాలయం ● త్వరలో నిర్ణయం వచ్చే అవకాశం



తెలుగుసాహిత్య పీఠం ప్రధాన ద్వారం

ఈనాడు, రాజమహేంద్రవరం: విద్యారంగం పరంగా రాజమహేంద్రవరం మరో మైలురాయి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉన్న విషయం తెలిసిందే. దీనికి అనుబంధంగా రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడిలో పీఠాలున్నాయి. విభజన చట్టం మేరకు పదేళ్ల గడువు పూర్తయ్యేలోగా వైకాపా సర్కారు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశాలకు అనుమతించకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలపై ఉన్నత విద్యాశాఖ దృష్టిసారించింది. రాజమహేంద్రవరం కేంద్రంగా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసి ఇతర పీఠాలను అనుసంధానం చేసే అంశాన్ని యోచిస్తోంది. నెలరోజుల్లో స్పష్టత రానుంది.

220 మంది విద్యార్థులు

రాజమహేంద్రవరం, కూచిపూడి, శ్రీశైలంలోని పీఠాల్లో సుమారు 220 మంది విద్యార్థులున్నారు. కొత్తగా చేరాలనుకున్న వారికి ఒక విద్యా సంవత్సరం వృథా అయ్యే అవకాశం ఉంది.

ఇక్కడే ఎందుకంటే...

రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరులోని 40 ఎకరాల్లో 48 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తెలుగు సాహితీపీఠం, భవనాలు ఉన్నాయి. నిర్వహణకు 72 మంది బోధన, 115 మంది బోధనేతర సిబ్బంది అవసరం. హైదరాబాద్‌లో పనిచేస్తున్నవారిలో 112 మంది బోధనా, బోధనేతర సిబ్బంది రాష్ట్రానికి చెందినవారే కావడంతో వారిని బదిలీ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నారు. ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ దిశగా కృషిచేయాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతోంది .

ఉన్నత విద్యాశాఖ దృష్టికి..

తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రవేశాలకు ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం అనుమతివ్వలేదు. రాజమహేంద్రవరంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను ఉన్నత విద్యాశాఖ అధికారులకు విన్నవించాం. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నాం.

-నిరీక్షణబాబు, ప్రొఫెసర్, ఓఎస్‌డీ, తెలుగు సాహిత్య పీఠం

ఈ కోర్సులు అందుబాటులోకి..

తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం, చరిత్ర, భాషా సాహిత్యం, తులనాత్మక సాహిత్యం, జ్యోతిషం, జర్నలిజం, లలిత సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, శిల్పం, చిత్రలేఖనం తదితర 17 విభాగాల్లో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, తదితర డిప్లొమో కోర్సులు ఉన్నాయి. ఇవన్నీ స్థానికంగా రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావొచ్చు. ● చరిత్ర, పురావస్తుశాస్త్రానికి సంబంధించి శ్రీశైలంలోని పీఠంలో ఎంఏ, పీహెచ్‌డీ కోర్సులున్నాయి. ● కూచిపూడి పీఠంలో కూచిపూడి నాట్యంలో ఎంఏ, సర్టిఫికెట్, డిప్లొమో కోర్సులు ఉన్నాయి. ఇవన్నీ యథవిధిగా కొనసాగించవచ్చు.

రైతేరాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

కస్టమ్స్ కార్యాలయంలో లంచాల బాగోతం

☛ ఏజెంట్ల ద్వారా సేకరణ.. సిబ్బంది వాటాలు..

☛ ఎఫ్ఐఆర్‌లో బండారం బయటపెట్టిన సీబీఐ

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్: ప్రైవేటు పార్టీల నుంచి కస్టమ్స్ హౌస్ ఏజెంట్లతో కలిసి నెలనెలా అక్రమ వసూళ్లు.. ఆ సొమ్మును సిబ్బందితో కలిసి పంచుకుంటూ అక్రమాలకు తెరతీయడం.. ఇదీ కాకినాడ పోర్టులోని కస్టమ్స్ కార్యాలయంలో సాగుతున్న తంతు.. పాపం పండింది.. కీలక సమాచారంతో సీబీఐ రంగంలోకి దిగింది. లంచం తీసుకుంటున్న, లంచం ఇచ్చిన వ్యక్తిని పట్టుకుని లోగుట్టు వెలికి తీసేందుకు దర్యాప్తు ముమ్మరం చేసింది. కాకినాడ కస్టమ్స్ కార్యాలయంలో రూ.3.18 లక్షలు లంచంగా తీసుకుంటూ సూపరింటెండెంట్ వై.శ్రీనివాసు, లంచం ఇస్తూ శ్రీచంద్ర బల్క్‌కార్గో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి పంతం భరత్‌కుమార్ పట్టుబడిన విషయం తెలిసిందే. వీరిచ్చిన సమాచారం ఆధారంగా కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ నుంచి రూ.22.74 లక్షలు, మరికొందరు అధికారుల నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సీబీఐ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాలు ఇక్కడి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో తేటతెల్లం చేసింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆగస్టు, సెప్టెంబర్ నెలల లంచం ఇవ్వాలని గత నెల 10న కస్టమ్స్ సూపరింటెండెంట్.. శ్రీచంద్ర బల్క్ కార్గో ప్రతినిధిని కోరారు. దీనిపై స్పందించిన ఆయన అక్టోబర్ మొదటి వారంలో ఇస్తానని.. సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 వేల చొప్పున ఇస్తానని చెప్పారు. లంచం మొత్తం తనకే అందిస్తే అధికారులందరికీ పంచాలని సూపరింటెండెంట్ చెప్పారు. గత నెల 23న మళ్లీ ఆ సొమ్ము కోసం డిమాండ్‌చేస్తూ బల్క్ కార్గో మేనేజర్ శివకు గుర్తుచేయాలని సూచించారు. 26న మేనేజర్‌తోనే నేరుగా మాట్లాడి సొమ్ము వెంటనే ఇవ్వాలని ఉద్యోగులంతా ఎదురుచూస్తున్నారని చెప్పడం గమనార్హం. ఈనెల 3న మళ్లీ గుర్తుచేయడంతో సమాచారం సీబీఐకి చేరింది. విశాఖపట్నం యూనిట్‌లోని అవినీతి నిరోధక అధికారులు దాడి చేశారు. కస్టమ్స్ అధికారులతో పాటు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తుల పాత్ర ఉందనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. కేసును సీబీఐ ఎస్పీ మురళీ రంబా ఆదేశాల మేరకు సీబీఐ డీఎస్పీ ఏకే దాబాస్ దర్యాప్తు చేస్తున్నారు.

టెట్‌కు 175 మంది గైర్హాజరు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నాలుగో రోజు సోమవారం కాకినాడ జిల్లాలో నాలుగు కేంద్రాలలో నిర్వహించారు. ఐయాన్ డిజిటల్స్ (కాకినాడ), సాఫ్ట్ టెక్నాలజీస్ (రాయుడుపాలెం)తో పాటు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలోని రెండు కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. ఈ నాలుగు కేంద్రాలలో ఉదయం, మధ్యాహ్నం రెండుపూటలా జరిగిన పరీక్షలకు 1340 మందికి 1165 మంది హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని, 175 మంది గైర్హాజరయ్యారని డీఈవో పి.రమేష్ తెలిపారు.

పల్లెల్లో అభివృద్ధి పండగ..!

సీసీరోడ్ల నిర్మాణానికి రూ.81.22 కోట్ల మంజూరు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామాల్లోని బాటలు అభివృద్ధి చెందనున్నాయి. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వంలో అడుగులు ముందుకు పడనున్నాయి. ఆగస్టు 23న ఒకే రోజు జిల్లాలోని 385 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆమోదం పొందిన కీలక పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 21 వరకు పల్లె పండుగ పేరుతో జిల్లాలోని పలు గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు చేయనున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులను ఈ నిర్మాణాలకు వినియోగించనున్నారు. దీనికి అదనంగా 15వ ఆర్థిక సంఘం, గిరిజన ఉప ప్రణాళిక నిధులు కేటాయిస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, విలీనమైన మూడు మండలాల్లో రూ.81.22 కోట్లతో మొత్తం 857 పనులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పరిపాలనా పరమైన ఆమోదం తెలిపారు. వీటికి సాంకేతికపరమైన అనుమతులను పూర్తిచేశారు. పనులు చేపట్టే గ్రామాల్లో సభలు నిర్వహించి, ప్రజలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయనున్నారు. ఇతర శాఖల నుంచి వివిధ పనులకు మంజూరైన నిధులతో కొన్ని పనులకు శంకుస్థాపనలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 21 లోగా మంజూరైన అన్ని పనులకు శ్రీకారం చుట్టేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


పిఠాపురం చిత్రాడలో సీసీరోడ్డుగా మారనున్న మట్టి రహదారి

మండలాల్లోనే పనుల గుర్తింపు..

ఎక్కడెక్కడ సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలో మండలస్థాయిలోనే ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఇప్పటికే గుర్తించారు. వీటిని నామినేషన్ పద్ధతిలో పూర్తిచేయనున్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పర్యవేక్షణలో అభివృద్ధి జరగనుంది. ప్రస్తుతం సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకే సాంకేతిక అనుమతులు ఇస్తున్నారు. గతంలో సీసీరోడ్లు నిర్మించి, డ్రెయిన్లు వదిలేశారు. అలాంటి పనులకు ఇప్పుడు అనుమతి లభించలేదు. త్వరలో ప్రత్యేకంగా సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి అనుమతులు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

ఇదీ అభివృద్ధి ప్రణాళిక..

నియోజకవర్గం/ మండలం	చేపట్టే పనులు	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
జగ్గంపేట	49	11.28
కాకినాడ గ్రామీణం	172	12.63
పెద్దాపురం	30	10
పిఠాపురం	204	13.07
ప్రత్తిపాడు	132	14.05
తుని	193	9.93
తాళ్లరేవు	15	3.43
పెదపూడి	35	3.49
కాజులూరు	27	3.43

పనుల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు..

గ్రామాల్లో ఆయా పనుల శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తిచేశాం. తొలిదశలో 857 పనులకు ఆమోదం లభించింది. రెండో దశలో మరిన్ని పనులు మంజూరు చేయనున్నారు. నాణ్యతలో రాజీపడకుండా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తాం.

మద్యం దుకాణాలకు 490 దరఖాస్తులు

మసీదు సెంటర్ (కాకినాడ): నూతన మద్యం విధానం ద్వారా 155 దుకాణాల ఏర్పాటుకు లైసెన్సుల జారీకి ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు లైసెన్సులు కోరుతూ 490 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తు చేయడానికి మరో రెండు రోజులే గడువుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఆఖరి రోజు, గడువు ముగుస్తున్న సమయంలో సాంకేతిక లోపాలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుందని అప్పటివరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈనెల 11న ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల కేటాయింపునకు డ్రా తీస్తామని వివరించారు. అభ్యర్థులు ఉదయం 7 గంటలకే ఎంట్రీకార్డు, ఐడీకార్డులతో హాజరుకావాలని సూచించారు.

కలెక్టరేట్‌కు అర్జీదారుల తాకిడి

కాకినాడ కలెక్టరేట్: అర్జీదారుల తాకిడితో సోమవారం కలెక్టరేట్ ప్రాంగణం రద్దీగా మారింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా, శిక్షణ కలెక్టర్ హెచ్.ఎస్.భావన, డీఆర్వో డి.తిప్పే నాయక్, ఉప కలెక్టర్లు ఎన్‌వీవీ సత్యనారాయణ, లావణ్య, సీపీవో పి.త్రినాథ తదితర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ ప్రాంగణం అర్జీదారులతో నిండిపోయింది. భూ సమస్యలు పరిష్కరించాలని, పింఛన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఆక్రమణలు తొలగించాలని, డ్రెయిన్లు, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, సదరం ధ్రువపత్రాలు జారీచేయాలనే తదితర సమస్యలతో 383 మంది వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. భూములు, రీసర్వేకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. నిర్దేశిత గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపుతూ ఎప్పటికప్పుడు నివేదికలను కలెక్టరేట్‌కు పంపాలని ఆదేశించారు.


సమస్య తెలుసుకుంటున్న జేసీ రాహుల్‌మీనా

జాగ్రత్త.. జారుతారు



నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే కాకినాడ పోర్టు రహదారి దుస్థితిలో చిక్కుకుంది. పోర్టుతో పాటు పలు కంపెనీలకు వెళ్లే ఆయిల్ ట్యాంకర్ల నుంచి చమురు లీకవుతూ రహదారిపై పడి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో వెళ్లే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎంత జాగ్రత్తగా వెళుతున్నా వాహనం జారుతోందని, అదుపు తప్పి కిందపడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో పోర్టుకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. **- ఈనాడు, కాకినాడ**

కాకినాడ తీరంలో పర్యాటకాభివృద్ధికి చర్యలు

సర్పవరం జంక్షన్: కాకినాడ సముద్ర తీరంలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, దీనికోసం ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధంచేశామని ఏపీ టూరిజం ఛైర్మన్ నూకసాని బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన సూర్యారావుపేట సముద్ర తీరంలోని ఎన్టీఆర్ బీచ్‌పార్కును సందర్శించారు. పర్యాటకులకు అందుతున్న సౌకర్యాలు, అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించి సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్వదేశీ దర్శన్, ప్రసాద్ వంటి పథకాలతో పర్యాటకం, ఆధ్యాత్మిక పర్యాటకాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాలాజీ బీచ్ ఫ్రంట్ పార్కులో చేపడుతున్న వాటర్‌పార్కు తదితర నిర్మాణాలపై పర్యాటకశాఖ అధికారులకు సూచించారు. జిల్లా పర్యాటకశాఖ అధికారి పసుపులేటి పోశయ్య, ఏఈ వెంకటేష్, ఏపీవో త్రిమూర్తులు పాల్గొన్నారు.


బీచ్‌పార్కును పరిశీలిస్తున్న బాలాజీ, అధికారులు

మూలపేటలో మార్కెట్‌లోకి దూసుకొచ్చిన కారు

ఓ మహిళ మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: గ్రామంలో వారపు సంత కావడంతో మార్కెట్‌లో రోడ్డు చిరు వ్యాపారులతో రద్దీగా ఉన్న సమయంలో ఓ కారు అదుపుతప్పి వారిపైకి దూసుకొచ్చిన ఘటన యు.కొత్తపల్లి మండలం మూలపేటలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. మూలపేటలోని జడ్పీ పాఠశాల సమీపంలో సోమవారం వారపు సంత జరుగుతోంది. అదే సమయంలో గొల్లప్రోలుకు చెందిన వ్యక్తి కారు అదుపు తప్పి వేగంగా రహదారి వెంట ఉన్నవారిని ఢీకొడుతూ వెళ్లింది. చిరువ్యాపారి చందక రమణమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందారు. రాయుడు అప్పారావుతో పాటు మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు రమణమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడున్నారు. భర్త గతంలో మృతి చెందాడు. రమణమ్మ మార్కెట్లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు (అంతర చిత్రంలో) రమణమ్మ(పాత చిత్రం)

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా మాదేపల్లి ప్రమాణం నేడు

కాకినాడ కలెక్టరేట్: కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మాదేపల్లి సత్యానందం మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రమాణం స్వీకారం చేయనున్నారు. నగర అధ్యక్షుడు చెక్కా నూకరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ సభ్యుడిగా మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మట్టా శివప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నక్కా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరిస్తారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎం.ఎం.పళ్లంరాజు, ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర నాయకులు మస్తాన్‌వలీ, ఏఐసీసీ సభ్యులు ఉష, విజయవాడ నగర అధ్యక్షుడు నరసింహారావు హాజరుకానున్నారు.


హారతి ఇస్తున్న స్వామి పరిపూర్ణానంద


గాయత్రీదేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక


కాంద్రకోటలో శ్రీమహాచండీదేవి


లోవ తలుపులమ్మ

లలితా సహస్రనామం.. శక్తిమంతం

సర్పవరం జంక్షన్, తుని గ్రామీణం, పెద్దాపురం: నియమనిష్టలతో లలితా సహస్రనామ పారాయణం చేయడం ద్వారా అమ్మవారు మనల్ని శక్తిమంతులను చేస్తుందని స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. కాకినాడ గ్రామీణం రమణయ్యపేట శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక అమ్మవారు సోమవారం భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. లక్ష కొబ్బరికాయలతో పూజ నిర్వహించారు. తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో అమ్మవారిని మహాచండీదేవి రూపంలో అలంకరించారు.

లైక్.. షేర్ చేస్తే డబ్బులు రావు

– న్యూస్‌టుడే, దానవాయిపేట (రాజమహేంద్రవరం)

డబ్బులు ఎవరైనా ఊరికే ఎందుకిస్తారు? లైక్ చేయండి.. షేర్ చేయండి.. మీ బ్యాంకు ఖాతాలో నగదు వేస్తాం అని రూ.వెయ్యి, రెండు వేలు ఎర వేసి ఆన్‌లైన్ మోసగాళ్లు రూ.లక్షలు దోచుకుంటున్నారు. ఇలాంటి మోసాలపై పోలీసులు, సైబర్ నిపుణులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఇటువంటి సంఘటనలు బయటపడుతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్నవారిలో అత్యధిక శాతం విద్యావంతులే కావడం పోలీసులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏమీ చదువుకోకపోయినా గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటే అవతలి వ్యక్తికి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. అలాంటిది బీటెక్ విద్యార్థి, ఇంజినీరు, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బ్యాంకు ఉద్యోగులు సైబర్ మోసాల బాధితుల్లో ఉండడం గమనార్హం.

యాప్ పేరిట మోసం

ఇటీవల జిల్లాలోని పలువురు ఓ యాప్‌లో రూ.వేలల్లో నగదు జమచేసి టాస్క్ తీసుకున్నారు. యాప్‌లో వచ్చిన వీడియోలను లైక్, షేర్ చేస్తే రూ.లక్షల్లో నగదు వస్తుందని నమ్మి 15 మందికి పైగా జిల్లావాసులు మోసపోయారు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావంతులు, పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు ఉన్నారు. జిల్లా ఎస్పీని కలిసి జరిగిన మోసాన్ని వీరు వివరించారు. దీంతో ఆయా స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు.



ఏం చేస్తారంటే..

ఐఎస్ఈ అనే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో వీడియోలు వస్తుంటాయి. మన పూర్తి వివరాలు నమోదు చేసి ఉచితంగానే లాగిన్ అవ్వచ్చు. అనంతరం అక్కడ ఉన్న వీడియోలను లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేసిన అనంతరం స్క్రీన్ షాట్ తీసి అప్‌లోడ్ చేస్తే రోజుకు రూ.75 చొప్పున యాప్‌లోని మన వ్యాలెట్‌లో వేస్తామని నేరగాళ్లు ఆశ చూపుతున్నారు. అలా జిల్లాలో పలువురు ముందుగా నాలుగు రోజులు ఈ టాస్క్ చేయగా అందరికీ రూ.300 వ్యాలెట్‌లోకి వచ్చింది. అనంతరం ఆ మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అయింది. అనంతరం ఏడాది కాలపరిమితితో ఉన్న రూ.2,100 టాస్క్ తీసుకుంటే రోజుకు రూ.75 నగదు వస్తుంది, రూ.5,500 టాస్క్‌తో రోజుకు రూ.200, రూ.18 వేలు టాస్క్‌తో రూ.600 చెల్లిస్తామని యాప్ నిర్వాహకులు నమ్మబలికారు. నగదు వస్తుందని ఆశతో 14 మంది రూ.18 వేలు టాస్క్ నగదు చెల్లించారు. రోజూవారీ వస్తున్న నగదు యాప్ వ్యాలెట్‌లో చేరినట్లు చూపేది. దానిని బ్యాంకు ఖాతాకు మార్పు చేస్తే కనీసం వేలు మాత్రం ఉండేది కాదు. నిలదీస్తే సాంకేతిక లోపం కారణంగా ఇలా జరిగిందని, సరిచేస్తామని సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పేవారు. రోజులు గడుస్తున్నా ఫలితం లేకపోవడంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేస్తే..

నష్టపోయిన నగదు రూ.15 వేలు పైన ఉంటే ఆన్‌లైన్ మోసం జరిగిన 48 గంటల్లోపు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఐటీ కోర్ పోలీసు బృందం స్పందించి బ్యాంకు ఖాతాను స్తంభింపజేస్తారు. నగదు వెనక్కి రప్పిస్తారు. నష్టపోయిన నగదు రూ.15 వేలు లోపే ఉంటే జాతీయ సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేసి విచారణ ఐటీ కోర్ విభాగానికి పంపిస్తారు.

అంతర్జాతీయ పోటీల్లో వెంకటహర్షకు బంగారు పతకం

మసీదు సెంటర్: ఉగాండాలో ఈనెల 3 నుంచి 6 వరకు నిర్వహించిన ఉగాండా అంతర్జాతీయ సిరీస్-2024 బ్యాడ్మింటన్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన వెంకటహర్ష రాయుడు ప్రతిభ చాటాడు. పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడిన హర్ష-నిత్ జట్టు బంగారు పతకం సాధించింది. హైదరాబాద్ పుల్లెల గోపీచంద్ అకాడమీలో దాదాపు ఐదేళ్లుగా బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందుతున్న హర్ష అచ్చంపేట గ్రామానికి చెందిన వీరరెడ్డి వసంతరాయుడు కుమారుడు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన హర్షను కాకినాడ డీఎస్ఏ బ్యాడ్మింటన్ కోచ్ చిన్నారి, కోచ్‌లు, క్రీడా సంఘం నాయకులు, క్రీడాకారులు అభినందించారు.



అర్బన్ బ్యాంకు అధ్యక్ష పీఠంపై తొలిసారి మహిళ

పిఠాపురం, న్యూస్‌టుడే: రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్న పిఠాపురం అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బ్యాంకు ఎన్నికలు ముగిశాయి. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ పీఠంపై జనసేన జెండా ఎగరడం, అధ్యక్షురాలిగా తొలిసారి మహిళ ఎన్నిక కావడం విశేషం. అర్బన్ బ్యాంకు ఛైర్‌పర్సన్‌గా చెల్లుబోయిన ప్రమీల, వైస్ ఛైర్మన్‌గా మేకం రామకృష్ణ, డైరెక్టర్లుగా బాలిపల్లి రాంబాబు, అరిగెల ప్రసాదరావు, అద్దంకి వెంకట రమణలతో ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయించి, ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించారు. ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లకు ఇద్దరే నామినేషన్ దాఖలు చేయడంతో వారినే ఏకగ్రీవంగా ప్రకటించారు. పాలకవర్గ సభ్యులను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు బ్యాంకు ఖాతాదారులు భారీ మెజార్టీ ఇచ్చారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బ్యాంకు అభివృద్ధిపై దృష్టి సారిస్తారని, ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని పాలకవర్గాన్ని కోరారు. సతీష్, సూరవరపు సురేష్, పిల్లా శివశంకర్, మార్నీడి రంగబాబు తదితరులు పాల్గొన్నారు.


ఛైర్‌పర్సన్ ప్రమీల తదితరులతో జనసేన నాయకుడు శ్రీనివాస్

నాటుకోళ్ల పెంపకంతో భలే ఆదాయం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పది ఎకరాలు వరి సాగు చేశారు.. ప్రకృతి సహకరించలేదు.. ఏటా ఏదో విధంగా నష్టాలే.. దీని నుంచి ఎలా బయటపడాలా అని రైతన్న నాటుకోళ్ల పెంపకం గురించి ఆలోచించారు.. ఆలోచన ఆచరణలో పెట్టి ఆదాయం గడిస్తున్నారు మండలంలోని జి.పెదపూడికి చెందిన ఇందుకూరి వీరభద్రరాజు. ఆయనకు నాటుకోళ్లలో నాణ్యమైన జాతిపట్ల అవగాహన ఉంది. నాణ్యమైన గుడ్లు సేకరించి పిల్లలు చేయించి వాటిని పెంచుతూ పెట్టలు, పుంజులు విక్రయించడం మొదలు పెట్టారు. మొదట్లో 50 పెట్టలు, ఆరు పుంజులతో మొదలు పెట్టిన ఆయన ఏటా వీటి సంతతిని పెంచుతూ గుడ్డు మొదలుకుని కోడి వరకు విక్రయిస్తున్నారు. కోడిపెట్ట రూ.1500లు వరకు విక్రయిస్తారు ప్రధానంగా కోడిపుంజులకు మంచి డిమాండు ఉంటుంది. పుంజుల పెంపకంపై మరింత శ్రద్ధ పెడుతున్నారు. మేత మొదలుకుని మందుల వరకు అన్ని విషయాల్లోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నాణ్యమైన కోడిపుంజు పూర్తిస్థాయిలో ఎదిగిన తరువాత రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుంది. ఏడాదికి 50 కోడిపుంజులు విక్రయిస్తే రూ.15లక్షలు వరకు వస్తుంది. దీంట్లో మేత ఇతర నిర్వహణ ఖర్చులు, కూలి ఖర్చులు పోను రూ.8 లక్షలు వరకు ఆదాయం వస్తుంది. ఇక పెట్టలు, పిల్లలు విక్రయించడం ద్వారా మరో రూ.3 లక్షలు ఆదాయం పొందుతున్నారు. కోళ్లకు మునగ, బొప్పాయి, ఆకు కూరలు, కూరగాయలు మేతగా వేస్తున్నారు. మునగ, బొప్పాయి ఆకులు మేతగా పెట్టడం ద్వారా మేత ఖర్చు తగ్గటమే కాకుండా కోళ్లకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని రైతు వీరభద్రరాజు తెలిపారు.


నాటుకోళ్లకు మేతవేస్తున్న ఇందుకూరి వీరభద్రరాజు

రైతేరాజు

స్ఫూర్తి

యాజమాన్య పద్ధతులతో ఆకుకూరల సాగు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

వేగంగా పెరిగి, అనతి కాలంలో చేతికందే పంటల్లో తోటకూర, పాలకూర ముఖ్యమైనవి. వీటి సాగుతో మంచి లాభాలు పొందవచ్చని **కొత్తపేట డివిజన్ ఉద్యాన శాఖాధికారి డాక్టర్ కోటేశ్వరరావు** సూచించారు. తోటకూర సాగుకు ఆన్.ఎన్.ఎ-1, కో-1, 2, పూసకీర్తి, కిరణ్ వంటి రకాలు అనుకూలం. పాలకూర సాగుకు పూస జ్యోతి, పూసాహరిత్ వంటి రకాలు అనువుగా ఉంటాయి. విత్తనం వేసే ముందు పశువుల ఎరువుతోపాటు ఎకరాకు 20 కిలోల భాస్వరం, 20 కిలోల నత్రజని, 20 కిలోల పొటాష్‌లను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. తోటకూర, పాలకూరకు ఒక్కోసారి పాముపొడ, ఆకుతినే పురుగులు వ్యాపించే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు పదిరోజుల మొక్కలపై లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె, గ్రాము సబ్బుపొడి కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. తెల్లమచ్చల చిత్తపురుగుల బెడద ఉంటే ఆకు కోత అనంతరం లీటరు నీటికి 1 మి.లీ డైక్లోరోపాస్ కలిపి చల్లాలి. తెల్లతుప్పు తెగులు ఆశిస్తే ఆరంభ దశలో తెగులు సోకిన మొక్కలను పీకివేయాలి. పక్షికన్ను తెగులు ఆశిస్తే లీటరు నీటికి 2.5 గ్రాములు మ్యాంకోజెబ్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసి నివారించవచ్చు.


ఆత్రేయపురంలో సాగవుతున్న ఆకుకూరలు

మీ కోసం

ఆయిల్‌పామ్‌లో కాండం తడి తెగులు

బిక్కవోలు: ఆయిల్‌పామ్ మొక్కలను ఆశించే తెగుళ్లలో కాండం తడి తెగులు ఒకటి. దీని లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డా. వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త (ఉద్యాన) డా.జి.రామానందం పలు సూచనలు చేశారు.

తెలుసుకుందాం..

తెగులు లక్షణాలు: తెగులు సోకిన చెట్టు మధ్యవరుసలో ఆకులు గోధుమవర్ణంలోకి మారతాయి. ముదురు ఆకులు చనిపోయిన తరువాత ఆ తెగులు లేత ఆకులకు సోకుతుంది. కాండంపై గడ్డపారతో గాయం చేస్తే దాని నుంచి గోధుమ వర్ణంలో భరించలేని దుర్వాసనతో ద్రవం వస్తుంది. ఈ తెగులు తీవ్రంగా ఉన్నపుడు చెట్టు కాండం బెరడు కొద్దిగా మాత్రమే గట్టిగా ఉండి లోపలి కణజాలం కుళ్లిపోతుంది.

నివారణ: తెగులు సోకిన చెట్లను తొలగించి కాల్చివేయాలి. ఆరంభ దశలో ఉంటే కాండానికి శస్త్ర చికిత్స చేసి చెట్టు రక్షించవచ్చు. కాండంపై గాట్లు పెట్టి కుళ్లిన కణజాలాన్ని దాని ఆనుకుని ఉన్న కణజాలాన్ని తొలగించాలి. దానిపై 1 శాతం కార్బండిజమ్, మోనోక్రోటోపాస్ మిశ్రమాన్ని కలిపి పూసి, ఆపై కోల్‌తారును పూయాలి.


కాండం తడి తెగులు సోకిన మొక్క

కొబ్బరి తోటల్లో ఇలా చేద్దాం

ప్రశ్న సమాధానం

ప్రశ్న: కొబ్బరితోట వయస్సు 20 సంవత్సరాలు, కొబ్బరికాయల పరిమాణం తగ్గిపోతుంది. దిగుబడి కూడా ఎక్కువ రావడంలేదు. ఏం చేయాలి.
- జి.శ్రీనివాసరావు, అమలాపురం

సమాధానం: వాతావరణ పరిస్థితులను బట్టి చీడపీడలు పెరిగి కాయల ఎదుగుదలపై ప్రభావంపడుతోంది. గతేడాది వేసిన ఎరువులను బట్టి కాంప్లెక్స్ ఎరువులు వాడితే వాటి బదులు సూటీ ఎరువులైన యూరియా, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో తోటల్లో వేయాలి.
- కిరీటి, ఉద్యానపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త



ప్రశ్న: కొబ్బరితోటల్లో మొవ్వులు సుడులు తిరిగినట్లు వస్తున్నాయి.నివారణ చర్యలు చెప్పండి.
- ఆర్.వెంకటేశ్వరరావు, అంబాజీపేట

సమాధానం: కొబ్బరితోటల్లో మొవ్వ ఆకులు ప్రతి నెలా ఒకటి రావడం గమనించవచ్చు. ఆ క్రమంలో కొమ్ముపురుగు ఆశించడం వల్ల ఈ మొవ్వ అనేది వంకరగా వస్తుంది. అలా కాకుండా బోరాన్ లోపంతో కూడా ఇలా మొవ్వులు సుడులు రావడానికి ఆస్కారం ఉంది. వీటిని పరిశీలించుకుని బోరాన్ లోపానికి బోరాక్స్ మందులు ఒక మొక్కకి 100 గ్రాములు వేస్తే క్రమంగా ఆరోగ్యవంతమైన మొక్క పెరగడానికి ఆస్కారం ఉంటుంది.
- కిరీటి, శాస్త్రవేత్త

– న్యూస్‌టుడే, అంబాజీపేట

నేటి నుంచి దసరా ప్రత్యేక రైలు

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: దసరా పండగ రద్దీని పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం కాకినాడటౌన్-సికింద్రాబాద్-కాకినాడటౌన్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు కాకినాడటౌన్ నుంచి ఈనెల 8, 10, 12 తేదీల్లో రాత్రి 9 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని వివరించారు. సికింద్రాబాద్ నుంచి 9, 11 తేదీల్లో సాయంత్రం 6.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు కాకినాడటౌన్ వస్తుందన్నారు. ఈ రైలు సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, తణుకు, భీమవరంటౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా సికింద్రాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఇందులో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్‌తో పాటు సాధారణ బోగీలు ఉంటాయని వివరించారు.

ఇంద్రకీలాద్రిపై ఉత్సవాల పర్యవేక్షణకు అన్నవరం ఈవో

అన్నవరం: విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా దేవాదాయ శాఖ అదనపు కమిషనర్, అన్నవరం దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్‌ను ప్రభుత్వం నియమించింది. దసరా ముందు నాలుగు రోజుల ఏర్పాట్ల పర్యవేక్షణకు రామచంద్రమోహన్‌ను నియమిస్తూ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలిచ్చారు. దీంతో ఆయన హుటాహుటిన అన్నవరం నుంచి బయల్దేరి విజయవాడ వెళ్లారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పిఠాపురం: పిఠాపురం మండలం భోగాపురం పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.9,60,720 విలువ చేసే 26 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహలత సోమవారం తెలిపారు. డ్రైవరు వి.గుర్రయ్య, బియ్యం కొనుగోలుదారు వి.వాసుపై కేసు నమోదు చేసి, వాహనాన్ని పిఠాపురం గ్రామీణ పోలీసులకు అప్పగించామన్నారు. ఈ బియ్యంను పెద్దాపురంలోని కోళ్లఫారానికి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. తనిఖీల్లో అధికారులు నాగ వెంకటరాజు, నవీన్‌కుమార్, వలీ, జీవానందం తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగించి.. బాలికపై అత్యాచారం

పిఠాపురం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పిఠాపురంలో బాలిక(16)పై అఘాయిత్యం జరిగిందని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబీకుల వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం పిఠాపురంలోని స్టువర్టుపేటలో నడిచివెళ్తున్న బాలికను ఇద్దరు వ్యక్తులు ఎవరిదో చిరునామా అడుగుతున్నట్లు నటించి కాగితం ఇచ్చారు. అది చదువుతుండగా ఆమెను బలవంతంగా ఆటోలో ఎక్కించి సమీపంలోని మాధవపురం డంపింగ్‌యార్డు వద్దకు తీసుకువెళ్లారు. కాసేపటికి ఆ బాలికను ఆటోడ్రైవర్, మరో మహిళ భుజాలపై మోసుకొచ్చి ఆటోలో ఎక్కిస్తుండగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకునే మహిళ చూసింది. అనుమానం వచ్చి ఏమైందని నిలదీసింది. బాలిక ముఖం చూసి గుర్తుపట్టి వారి బంధువులకు ఫోన్ చేసి చెప్పింది. ఆ వెంటనే కుటుంబసభ్యులు అక్కడికి చేరుకున్నారు. డంపింగ్‌యార్డులో నిలిపిన ఆటోకు మరో వాహనం అడ్డుగా ఉండడంతో వారు పారిపోయేందుకు వీల్లేకపోయింది. దాంతో వారిద్దరినీ పట్టుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను వైద్యం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలికకు మద్యం తాగించి, అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి పిఠాపురానికి చెందిన ఓ ప్రధాన పార్టీ నాయకురాలి భర్తగా భావిస్తున్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.


వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

సినీ ఫక్కీలో చోరీ

మహిళ మెడలోని 40 గ్రాముల ఆభరణాలు లాక్కెళ్లిన చోరులు

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: దర్జాగా ద్విచక్ర వాహనంపై పురవీధుల్లో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో చక్కర్లు కొట్టారు. ఓ మహిళ మెడలో బంగారు వస్తువులు ఉండటాన్ని గమనించారు. పక్కాగా రెక్కీ నిర్వహించారు. పెద్దగా రద్దీలేని వీధిలోకి మహిళ రాగానే తక్కున బైక్ దిగి మెడలోని సుమారు రూ.2.50 లక్షలు విలువైన 40 గ్రాముల నల్లపూసల దండ, పుస్తెలతాడు లాక్కొని క్షణాల్లో పరారయ్యారు. పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపిన వివరాలివీ.. నంబరు ప్లేట్ లేని ద్విచక్ర వాహనం పై ఇద్దరు దుండగులు ఓ మహిళను అనుసరించారు. లోవకొత్తూరు గ్రామానికి చెందిన కర్రి లక్ష్మీ సరిగ్గా నారాయణరాజు గారి వీధిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళుతుండగా మెడలో నుంచి బంగారు పుస్తెల తాడు, నల్లపూసల దండను లాక్కొని పారిపోయారన్నారు. ఒక్కసారిగా దాడి జరగడంతో కంగుతున్న ఆమె, దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. మహిళలు నిర్మానుష్య ప్రదేశాలు, రోడ్లపై ఒంటరిగా వెళ్లవద్దని, మెడలో వేసుకున్న బంగారు ఆభరణాలు కనిపించకుండా చీర కొంగు, చున్నీ కప్పుకొని ఉండాలని సూచించారు. దుండగుల్లో ఒకరు వీపు వెనుక బ్యాగు తగిలించుకుని ఉన్నాడని, దీనిపై అన్ని కోణాల్లోను ముమ్మర దర్యాప్తు చేపట్టామన్నారు. ఏవిధమైన సమాచారం ఉన్నా తక్షణం పోలీసులకు తెలపాలన్నారు.


రోడ్డుపై నడిచి వెళుతున్న మహిళ.. ఎదురుగా దొంగలు


మెడలో నుంచి తాళిబొట్టు లాగుతున్న దుండగుడు

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు (కిలోకు)

గాంధీనగర్: టమాట - 40, వంకాయలు - 40, 60, బెండకాయలు - 36, పచ్చిమిర్చి - 30, 36, కాకరకాయ - 36, బీర - 48, కాలీఫ్లవర్ - 15, 20, క్యాబేజీ - 40, క్యారెట్ - 46, దొండకాయలు - 56, బంగాళాదుంపలు - 30, 34, ఉల్లి - 46, 50, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 36, ఆనపకాయ - 55, 40, పొట్లకాయ - 18, 20, అరటికాయ - 6, 7, చిక్కుళ్లు - 66, 100, చేమదుంపలు - 30, 40, మునగకాడలు - 10, 12, బీట్‌రూట్ - 38, కీరదోస - 30, బీన్స్‌కాయలు - 70, అల్లం - 54, క్యాప్సికం - 80, బొబ్బర్లు - 46, చిలగడదుంపలు - 40, మామిడికాయ ఒకటి - 15, 18, నిమ్మకాయలు డజన్ - 24, 60.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్ - **దేవర పార్ట్ 1**, దక్షిణ, సత్యం సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్ - **దేవర పార్ట్ 1**, సత్యం సుందరం, కాళీ, లక్ష్మీ - **దేవర పార్ట్ 1**, సత్యగౌరి - బహిర్భూమి, తిరుమల - మన్మథ (ఉ. రా), కమిటీ కుర్రోళ్లు (మ. సా), సీఅండ్‌సీ 1 - మత్తువదలరా 2, సీఅండ్‌సీ 2 - శ్వాగ్, శ్రీప్రియ - రామ్‌నగర్ బన్నీ, పద్మప్రియ - **దేవర పార్ట్ 1**, సూర్య 1 (వాకలపూడి) - **దేవర పార్ట్ 1**, సూర్య 2 - మిస్టర్ సెలబ్రిటీ, శ్రీశ్రీనివాసా (వేళంగి) - **దేవర పార్ట్ 1**.

ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన



అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న కమిషనర్ భావన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపుతామని కమిషనర్ భావన తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గత వ్యవధిలో 9 మంది ఆమెకు వివిధ సమస్యలను విన్నవించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. ఇందులో 35 మంది వివిధ సమస్యలను వివరించారు. ఆక్రమణలు తొలగించాలని, పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని, వీధి దీపాలు వెలిగించాలని, ఇంటి పన్నులకు సంబంధించి దిద్దుబాట్లు ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ మనోహర్, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో..

కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించారు. కొత్త ఆర్డీవో ఎస్.మల్లిబాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి సంయుక్త సమావేశం



శిక్షణ కలెక్టర్ భావనకు సమస్య వివరిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంయుక్త సమావేశం నిర్వహించాలని సీఐటీయూ నగర కన్వీనర్ పలివెల వీరబాబు, కోకన్వీనర్ మలకా వెంకటరమణ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో శిక్షణ కలెక్టర్ హెచ్.ఎస్.భావనకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ప్రజా ఆరోగ్యం, ఇంజినీరింగ్ విభాగాల్లో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్, థర్డ్‌పార్టీ కాంట్రాక్టు విధానంలో కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి వేతనాలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. ఇంకా అనేక సమస్యల పరిష్కారానికి సంయుక్త సమావేశం ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు.

నాగశివలింగం అపహరణపై కేసు పెట్టాలి..

బాలాత్రిపురసుందరి ఆలయం కోనేరు నుంచి అపహరణకు గురైన నాగశివలింగం శిలావిగ్రహం కేసుపై దర్యాప్తు చేయాలని ఆధ్యాత్మికవేత్త దూసర్లపూడి రమణరాజు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ రాహుల్‌మీనాకు ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖ నిర్లక్ష్యంతో నాలుగు నెలల కిందట శివలింగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి, రూ.లక్షలు సొమ్ము చేసుకున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి కేసు నమోదు చేయాలని కోరారు.

అయిదేళ్లు... రూ.250 కోట్లు..!

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు పూర్తిచేసుకునే తరుణంలో వికసిత్ భారత్‌కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కాకినాడ నగరాభివృద్ధికి స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేశారు. అయిదేళ్లలో రూ.250 కోట్లతో కాకినాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధమైంది. స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా నగరానికి కేంద్రం రూ.1000 కోట్లు ఇచ్చింది. ఇప్పుడు స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ అమలైతే అభివృద్ధి పరుగులు పెట్టనుంది.

ఏడు రహదారుల విస్తరణ..

నగరంలో 40 అడుగుల వెడల్పున్న ఏడు రహదారులను 30 కి.మీ. మేర రూ.20 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రా అసెట్స్ మేనేజ్‌మెంట్ (ఏపీయుఐఏఎంసీ) సంస్థ సహకారంతో పీపీపీ విధానంలో పనులు చేయనున్నారు. ప్రతిపాదనలు పంపగా, త్వరలో టెండర్లు పిలుస్తారు. ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ లైటింగ్, డ్రెయిన్లు, మొక్కల పెంపకం, సుందరీకరణ, స్ట్రీట్ ఫర్నీచర్, వీధి దీపాలు వంటి పనులు చేపడతారు. 10 కి.మీ మేర రూ.12 కోట్లతో కచ్చారోడ్లను సీసీ రహదారులుగా మారుస్తారు. 10 కి.మీ మేర రూ.10 కోట్లతో గ్రావెల్ రోడ్లను బీటీ రహదారులు విస్తరిస్తారు. 15 కి.మీ మేర రూ.10.50 కోట్లతో కొత్త డ్రెయిన్లు నిర్మిస్తారు.

✦ కల్పన కూడలి నుంచి కుంభాభిషేకం రేవు రోడ్డు. ✦ సర్పవరం కూడలి నుంచి మహాలక్ష్మీనగర్ బాలయోగి విగ్రహం. ✦ నాగమల్లి తోట నుంచి ఎన్‌ఎఫ్‌సీఎల్. ✦ తోట సుబ్బారావు కూడలి నుంచి కరణంగారి కూడలి, జీపీటీ, భానుగుడి, ఎల్‌బీ నగర్. ✦ అంబేడ్కర్ విగ్రహం నుంచి బాలాజీచెరువు, ఎన్టీఆర్ వారధి. ✦ వార్ఫురోడ్డు, సినిమారోడ్డు నుంచి రంగరాయ వైద్యకళాశాల బాలుర వసతి గృహం ✦ అన్నమ్మఘాటీ నుంచి నూకాలమ్మగుడి.



సినిమా రోడ్డు

రూ.115 కోట్లతో పనులు..

అమృత్-2 పథకంలో నగరపాలక సంస్థకు రూ.115 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 22 వేల గృహాలకు కొళాయిలు. జగన్నాథపురంలో 25 ఎంఎల్‌డీ నీటి శుద్ధి ప్లాంటు. అరట్లకట్ట నుంచి జగన్నాథపురం వరకు తాగు నీటి పైపులైను. 700 లీటర్ల సామర్థ్యంతో ఈఎల్‌ఎస్ఆర్ నిర్మాణం. 63 కి.మీ మేర తాగునీటి పైపులైను ఏర్పాటు. పాత పంపుసెట్ల మార్పునున్నారు.

వీటికీ ప్రాధాన్యం..

రూ.20 కోట్లతో బయోమెథనేషన్ ప్లాంట్ ఏర్పాటు. ✦ పొడి చెత్త ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు. ✦ రూ.27 కోట్లతో సంజయ్‌నగర్ డంపింగ్‌యార్డులో చెత్తను బయోమైనింగ్ ద్వారా శుభ్రం చేసి తరలించడం. ✦ అమృత్-1లో ఆగిపోయిన 5 ఎంఎల్‌డీ ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణం తిరిగి ప్రారంభించడం. ✦ అమృత్-2లో 6, 16 ఎంఎల్‌డీ ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు. ✦ రేచర్లపేట, జగన్నాథపురం ఉద్యానాల అభివృద్ధి. అన్నమ్మఘాటీ, సంతచెరువు చెరువుల ఆధునీకరణ, సుందరీకరణ.



అభివృద్ధి చేయనున్న అన్నమ్మఘాటీ చెరువు

దశలవారీగా అమలు

అమృత్-2లో వచ్చిన రూ.115కోట్లకు డీపీఆర్ తయారు చేసి, ఈఎన్‌సీకి పంపించాం. అనుమతి రాగానే టెండర్లు పిలుస్తాం. రహదారుల అభివృద్ధికి ఏపీయూఐఏఎం ద్వారా టెండర్లు పిలుస్తాం. రోజూ 37 ఎంఎల్‌డీ మురుగునీరు విడుదలవుతోంది. 27 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీలు ఏర్పాటు చేసి, మురుగునీటిని శుద్ధి చేసి కాలువలోకి విడిచిపెడతాం. బయోమైనింగ్‌కు రీ-టెండర్లు పిలుస్తాం. చెత్త ఉన్న స్థలాన్ని ఖాళీ చేసి రైల్వేకు అప్పగిస్తాం. విజన్ డాక్యుమెంట్ రూపొందించాం. దశలవారీగా అమలు చేస్తాం.

- భావన, కార్పొరేషన్ కమిషనర్

శంకరన్ సేవలు చిరస్మరణీయం



శంకరన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దళిత, వామపక్ష పార్టీల నాయకులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆదర్శ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయమని దళిత, వామపక్ష పార్టీల నేతలు కొనియాడారు. సోమవారం శంకరన్ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, 1/70 చట్టం వంటి అనేక కీలక అంశాలల్లో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. నక్సల్‌తో ప్రభుత్వం చర్చలు జరపడానికి ఆయన మధ్యవర్తిగా వ్యవహరించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అయితాబత్తుల రామేశ్వరరావు, కేఎస్‌శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, డి.ప్రభాకర్, జె.వెంకటేశ్వర్లు, గుబ్బల ఆదినారాయణ, మలక వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

10న అంబులెన్సులు పునఃప్రారంభం



ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న సభ్యులు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కొవిడ్ సమయంలో కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఎంతో మంది అన్నార్తులకు అండగా నిలిచిన కాకినాడ ఖిద్మత్ కమిటీ అందించిన అంబులెన్సు సేవలను పునఃప్రారంభిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, నగరపాలక సంస్థ కమిషనర్ భావన చేతుల మీదుగా ఈనెల 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు కల్పనా కూడలిలో సేవలు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కమిటీ సభ్యులు ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు ఆహ్వానపత్రిక అందించారు.

అంగన్‌వాడి సమస్యలపై వినతిపత్రం



పీడీ ప్రవీణకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడి నాయకులు

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: అంగన్‌వాడి కేంద్రాల్లోని సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణకు అవసరమైన రికార్డులు ప్రభుత్వమే సరఫరా చేయాలని, గర్భిణులు, బాలింతలకు పోషకాహార మాసోత్సవాల్లో కేటాయించిన రూ.250 సరిపోవడంలేదని, అదనపు బడ్జెట్ కేటాయించాలని కోరారు. టీఏ, డీఏ, అద్దె, ఇతర బకాయిలు ప్రతి నెలా మంజూరు చేయాలన్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్ బండలను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి, జిల్లా కమిటీ సభ్యులు ఎంకే జ్యోతి, టి.నీరజ, ఎం.రాజేశ్వరి, జి.రామలక్ష్మి, సిహెచ్.రమ, వి.వీరమణి, జి.వరలక్ష్మి, జి.చామంతికుమారి, యు.రాజేశ్వరి, జి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం రూఫ్‌కు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన



డీఎస్ఏ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం పైకప్పునకు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్ఏ ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం నాసిరకం పనులతో ప్రస్తుత వర్షాలకు బ్యాడ్మింటన్ కోర్టులో పలుచోట్ల వర్షపునీరు కారడంతో క్రీడాకారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గత నెల 29న 'నాసిరకం పనులు.. ఆడేదెలా ఆటలు..?' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో స్మార్ట్‌సిటీ అధికారులు మరమ్మతు పనులు చేయిస్తున్నారు. వర్షపునీరు కారకుండా బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం పైకప్పునకు నాలుగు రోజులుగా పనులు చేస్తున్నారు.

కిక్కిరిసిన బస్సులు.. రద్దీగా రైళ్లు

పండగ ప్రయాణాలతో సందడి

దసరా పండగను పురస్కరించుకుని కాకినాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, వేర్వేరు చోట్ల నుంచి వచ్చేవారితో రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్లలో రద్దీ నెలకొంది. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో రాకపోకలు పెరిగాయి. వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. కొందరు సొంతూళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతుంటే.. మరికొందరు బంధువుల ఇళ్లు, ఇతర పర్యాటక కేంద్రాలకు వెళ్లేందుకు రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్ (కాకినాడ)

దూరప్రాంతాలకు ప్రత్యేక బస్సులు..



రైలులో కాకినాడకు చేరుకున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్టాండులో సైతం ప్రయాణికుల రద్దీ పెరగడంతో ప్రత్యేక బస్సులు నడిపేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఒక్కొక్కటిగా ప్రత్యేక బస్సులను పలు రూట్లలో నడుపుతున్నారు. అత్యంత రద్దీగా ఉండే పండగ మూడు రోజుల పాటు అధిక సంఖ్యలో బస్సులు నడపాలని నిర్ణయించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాకినాడ బస్టాండులో ప్రత్యేక కౌంటర్ తెరిచారు. సాధారణ, ప్రత్యేక బస్సుల సమయాలు, ఇతరత్రా సమాచారం తెలిపేందుకు ముగ్గురు సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు.

రిజర్వేషన్లు నిల్..

ఇప్పటికే పలు ముఖ్య రైళ్లలో రిజర్వేషన్ బెర్తులు, సీట్లు లభించడం లేదు. నిరీక్షణ జాబితా చాంతాడులా పెరిగిపోతోంది. ఏసీ కోచ్‌లదీ అదే పరిస్థితి. ప్రతి రైలులో స్లీపర్, జనరల్ బోగీలన్నీ కిక్కిరిసి కనిపిస్తున్నాయి. జనరల్ బోగీల్లో అయితే కాలు పెట్టే పరిస్థితి కనిపించడంలేదు. సర్కార్, శేషాద్రి, గౌతమి, కోకనాడ్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బోగీలన్నీ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడాయి.

బీసీలను నట్టేట ముంచిన వైకాపా ప్రభుత్వం



పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం బీసీలను నట్టేట ముంచిందని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు. జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య శిక్షణ, పరిశోధన సంస్థ కార్యాలయంలో సోమవారం నగరానికి చెందిన బోటు యజమానులకు రూ.82.95 లక్షల విలువైన 395 జీపీఎస్ ట్రాన్స్‌పాండర్ పరికరాలను ఆయన పంపిణీచేశారు. జిల్లా మత్స్యశాఖాధికారి కె.కరుణాకరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదరణ, మత్స్యకారుల రాయితీ పథకాలను నిలిపివేసి వైకాపా ప్రభుత్వం బీసీలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక బీసీలకు మంచి రోజులొచ్చాయని, 40 శాతం రాయితీపై ఇవ్వాల్సిన జీపీఎస్ ట్రాన్స్‌పాండర్ పరికరాలను ఉచితంగానే ఇస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం పూర్తి రాయితీపై అందిస్తున్న పరికరాలతో బోటు యజమానులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షుడు బలసాడి రంగారావు, బోట్ల యాజమానుల సంఘం అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాటి బాబు మాట్లాడారు. రాష్ట్ర మత్స్య పరిశోధన, శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ సుమలత, మత్స్యకార నాయకులు మల్లాడి రాజు, చింతా పేర్రాజు, పంతాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 50 వినతులు

మసీదుసెంటర్ (కాకినాడ): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పలువురి నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 50 మంది తమ సమస్యలపై ఫిర్యాదుదారులు అందించారు. వాటిపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి, సకాలంలో పరిష్కరించాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేనివారు జిల్లాలోని పోలీసు స్టేషన్లు, సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలోని బుడంపేటకు చెందిన 16 ఏళ్ల బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సోమవారం జీజీహెచ్‌లో చేర్పించారు. బాలిక 10వ తరగతి తప్పడంతో చదువు మానేసి ఇంటిలోనే ఉంటోంది. కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ మందులు వాడుతోంది. చచ్చిపోవాలనుందని తరచుగా కుటుంబ సభ్యులతో చెబుతుండేది. ఈ క్రమంలో సోమవారం ఇంటిలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకునే ప్రయత్నంలో ఉండగా కుటుంబ సభ్యులు గుర్తించి జీజీహెచ్‌కు తరలించారు. బాలిక అపస్మారకస్థితిలో చికిత్స పొందుతోందని వైద్యులు తెలిపారు.

✦ జగన్నాథపురానికి చెందిన 35 ఏళ్ల వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈమె భర్త పనిలోకి వెళ్లకుండా మద్యం తాగి వచ్చి ఆమెను కొడుతున్నాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంటిలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను చికిత్స నిమిత్తం సోమవారం జీజీహెచ్‌లో చేర్చారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మసీదుసెంటర్: కొండయ్యపాలెం కొత్తవంతెన నుంచి నాగమల్లితోట వెళ్లే రహదారిలోని ఓ నీటిగుంతలో గుర్తుతెలియని మృతదేహం సోమవారం లభ్యమైంది. రెండో పట్టణ పోలీసుల వివరాల ప్రకారం 40 ఏళ్ల వయస్సున్న పురుషుడు చీడిలపొర రహదారి పక్కన నీటి గుంతలో అనుమానస్పద స్థితిలో మృతిచెందాడని, మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవన్నారు. దాదాపు అయిదు రోజుల క్రితమే ప్రాణాలు కోల్పోయి ఉంటాడని, మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉబ్బిపోయిందని పోలీసులు తెలిపారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

ఎట్టకేలకు రోడ్డెక్కిన వాహనాలు



చెత్త సేకరిస్తున్న టిప్పర్ వాహన సిబ్బంది

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరపాలకసంస్థలో నెల రోజులుగా యార్డుకు పరిమితమైన టిప్పర్ వాహనాలు ఎట్టకేలకు సోమవారం రోడ్డెక్కాయి. ఇంటింటా చెత్త సేకరణకు వినియోగిస్తున్న ఈ వాహనాలకు బిల్లులు చెల్లించకపోవడంతో నిలిపివేశారు. కొంతమేర సొమ్ములు చెల్లించడంతో 105 వాహనాల్లో 54 విధుల్లోకి దిగాయి. వీటి ద్వారా ఇంటింటా చెత్త సేకరణ ప్రారంభమైంది. మిగిలిన వాహనాలను ఒకటి, రెండు రోజుల్లో వినియోగంలోకి తెస్తామని కమిషనర్ భావన చెప్పారు.

తనిఖీలు ప్రారంభం..

నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి భావనను నియమించిన తరవాత రోజువారీ పారిశుద్ధ్య పనుల తనిఖీ మందగించింది. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కమిషనర్ సోమవారం నుంచి క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టారు. నగరంలోని 13వ శానిటేషన్ సర్కిల్ 46వ డివిజన్ కొండయ్యపాలెంలో పారిశుద్ధ్య పనులను ఆమె తనిఖీ చేశారు. కార్మికులు, సచివాలయ సిబ్బంది, అధికారులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ జీఎస్‌నాయుడు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దాడులపై వామపక్షాల నిరసన



నిరసన ప్రదర్శనలో వామపక్ష పార్టీల కార్యకర్తలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ ఆటవిక దాడులను ఆపాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కాకినాడలో వామపక్ష పార్టీల కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. యుద్ధం ప్రారంభమై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా కలెక్టరేట్ నుంచి జడ్పీ కూడలి, జీజీహెచ్ మీదుగా బాలాజీచెరువు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం, అమెరికన్ సామ్రాజ్యవాద దౌర్జన్యం నశించాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. బాలాజీచెరువు వద్ద జరిగిన సభకు సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేగల ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో జె.వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, కె.బోడకొండ, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పలివెల వీరబాబు, తోకల ప్రసాద్, సీహెచ్.అజయ్ కుమార్, పద్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సాంబమూర్తి స్మృతులు పదిలం



అతిథులు కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, సంకురాత్రి చంద్రశేఖర్‌లతో ఆర్కిటెక్టులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కాకినాడకు చెందిన మహర్షి బులుసు సాంబమూర్తి స్మృతులు, ఆయన విగ్రహం, ఆయా ప్రాంతాలను అభివృద్ధిచేసి పదిలపర్చేందుకు ఐఐఏ కాకినాడ ఛాప్టర్ ఆర్కిటెక్ట్స్ ముందుకు రావడం అభినందనీయమని కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు పేర్కొన్నారు. సోమవారం సూర్యకళా మందిరంలో ప్రపంచ ఆర్కిటెక్ట్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయన విగ్రహ ప్రాంతాన్ని సుందరవనంగా మార్చేందుకు సిద్ధంచేసిన నమూనా ఆకట్టుకుంటోందన్నారు. మరో అతిథి డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ బులుసు కాకినాడ వాసి కావడం అదృష్టమన్నారు. ఈసందర్భంగా నూతన ప్రాంగణ నమూనాలను అతిథులు ఆవిష్కరించారు. వి.వి.ఎల్.ఎన్.మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి లక్కరాజు సత్యనారాయణ (టిక్కు), ఆర్కిటెక్ట్ రాజశేఖర్, ఛాప్టర్ ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాసు, కార్యదర్శి వీరవెంకటేష్, కోశాధికారి నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, నాయన సత్యారెడ్డి రాజ్‌జైన్, జయ, వీరు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాలపై దాడులు హేయం

గాంధీనగర్, న్యూస్‌టుడే: సాయిబాబా భక్తులను మనోవేదనకు గురిచేసేలా ఉత్తరప్రదేశ్‌లోని సాయిబాబా ఆలయాలపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని సాయిబాబా భక్తులు చోడిశెట్టి కాశీవిశ్వేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం శ్రీనగర్‌లోని కెమిస్ట్ అసోసియేషన్ భవన్‌లో బాబా భక్తులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సాయిబాబాకు భక్తులు ఉన్నారని, ఆయన్ను ఒక మార్గదర్శిగా, గురువుగా కొలుస్తున్నారన్నారు. సాయి భక్తులు సంఘటితమై శాంతియుతంగా నిరసనలు తెలపాలని కోరారు. సమావేశంలో కోలా నరసింగరావు, కె.వెంకటసుబ్బారావు, ముమ్మిడి సత్తిబాబు, గొల్లపల్లి పెదకాపు, దామిశెట్టి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి ఉత్సవం

గాంధీనగర్, న్యూస్‌టుడే: విశ్వహిందూ పరిషత్ జిల్లా దుర్గావాహిని, మాతృశక్తి మహిళల ఆధ్వర్యంలో దుర్గాష్టమి ఉత్సవాన్ని సోమవారం గాంధీనగర్ ఓలేటి వారివీధిలోని వీహెచ్‌పీ కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా శక్తిస్వరూపిణి దుర్గాదేవి చిత్రపటాన్ని పూజించి, రాణిరుద్రావతి చిత్రపటానికి పూలమాలలు వేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో హిందూ మహిళలు వీరత్వం ప్రకటించాల్సిన ఆవశ్యకత వచ్చిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీకృష్ణవాణి, రామారావుపేట ప్రఖండ సంస్కృత ప్రచార ప్రముఖ్ శ్రీదేవిరాణి, వీహెచ్‌పీ సంఘటన కార్యదర్శి గోవిందు, కార్యకర్తలు లలిత, పెండెం శ్రీదేవి, జి.పద్మ, ఉదయభానోజీరావు, అధిక సంఖ్యలో హిందూ మహిళలు పాల్గొన్నారు.

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం



నీటి నాణ్యతను పరీక్షిస్తున్న డీఈఈ గంగరాజు

శుద్ధజలం సరఫరాకు చర్యలు

గొల్లప్రోలు: గొల్లప్రోలులో కుళాయిల ద్వారా శుద్ధ జలం సరఫరా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ప్రజారోగ్యశాఖ డీఈఈ పి.గంగరాజు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి గొల్లప్రోలులోని రక్షిత నీటి పథకాన్ని సోమవారం తనిఖీ చేశారు. కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పరీక్షించారు. సిబ్బందితో మాట్లాడారు. జగనన్న కాలనీని పరిశీలించి నీటి సరఫరాపై సమీక్షించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి

11 మండలాలు.. 14 అర్జీలు

పెద్దాపురం: పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల నుంచి 14 అర్జీలు వచ్చినట్లు పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి తెలిపారు. పరిష్కారానికి ఆయా మండలాల తహసీల్దార్లకు సూచనలు చేశామన్నారు.

కాకినాడ గ్రామీణ ఎంపీడీవోగా సతీష్



సతీష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యదర్శులు

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం ఎంపీడీవోగా పసుపులేటి సతీష్ సర్పవరం జంక్షన్‌లోని కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కాకినాడలో ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. సతీష్‌కు పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం తెలిపారు.

గ్రామీణ ఎమ్మెల్యేను కలిసిన డీపీవో



నానాజీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న రవికుమార్

సర్పవరం జంక్షన్: కాకినాడ జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వి.రవికుమార్ సోమవారం కాకినాడలోని కార్యాలయంలో గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలోని పంచాయతీల అభివృద్ధిపై ఇరువురూ కాసేపు చర్చించారు.

భావనారాయణస్వామి ఆలయ ఈవోగా మాచిరాజు

సర్పవరం జంక్షన్: సర్పవరం గ్రామంలోని పురాణ ప్రసిద్ధ స్వయంభూ శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయ ఈవోగా మాచిరాజు లక్ష్మీనారాయణ సోమవారం ఇక్కడి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆలయాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. అర్చకులు, ఆలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

పాదాలతో తంతే.. పతకాలే..

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఫుట్‌బాల్ పోటీల్లో గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటుతున్నారు. మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయిలో బహుమతులతోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. ఇటీవల ఎంపికల్లో రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం పొందిన విద్యార్థినులు వేసవి సెలవుల్లోనైతం సాధన చేశారు. ఆట స్థలం, సరైన వసతులు లేకున్నా రాణిస్తున్నారు.



ఫుట్‌బాల్ స్టేట్ మీట్‌లో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

నిత్య శిక్షణతో రాణింపు

గత నెలలో తిరుపతిలో జరిగిన ఫుట్‌బాల్ స్టేట్ మీట్‌లో ప్రతిభ చూపి గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎస్.హరిప్రియ, వి.గ్రాహి, ఎన్.పూర్ణ కల్యాణి తృతీయ స్థానంలో నిలిచారు. నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో ఈ ముగ్గురూ బహుమతులు పొందారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్ 19 పోటీలకు ఎంపికయ్యారు. పీఎస్ఎస్ సూర్యకుమారి, ఎ.శ్రీజాహ్నవి, ఎం.దుర్గాశ్రీఅపర్ణ, ఎం.పూజ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టులో స్థానం సాధించారు. ఈ నలుగురు క్రీడాకారులు మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో బహుమతులు సాధించారు. పోటీల్లో పాల్గొనేందుకు వీరు రోజూ శిక్షణ పొందుతున్నారు. ఇదే పాఠశాలకు చెందిన జి.సాయిలక్ష్మి రాష్ట్ర స్థాయి అండర్ 17 పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైంది. సాయిలక్ష్మి గతంలో జరిగిన నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడు బహుమతులు సాధించింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచూపి బహుమతులు సాధించి పాఠశాలకు, జిల్లాకు గుర్తింపు తీసుకువస్తామని క్రీడాకారులు పేర్కొంటున్నారు.



సాధన చేస్తున్న క్రీడాకారిణులు

సత్తా చూపేందుకు సన్నద్ధం

రాష్ట్ర స్థాయి అండర్ 19, అండర్ 17 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రోజూ శిక్షణ పొందుతున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచూపి బహుమతులు సాధించేందుకు సన్నద్ధమయ్యారు. హెచ్‌ఎం సూర్యప్రకాశ రెడ్డి ప్రోత్సాహంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం.

- వీరలక్ష్మి, పీడీ, గొల్లప్రోలు

10న పోస్టాఫీసులో ఆధార్ మేళా

సామర్లకోట: సామర్లకోట పెద్ద పోస్టాఫీసులో ఈ నెల 10న గురువారం ఆధార్ మేళా నిర్వహిస్తున్నట్లు పోస్టు మాస్టర్ అమ్మిరాజు సోమవారం తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా ఉంటుందన్నారు. ఆధార్‌కార్డుకు సంబంధించి అన్ని రకాల మార్పుచేర్పులు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని సామర్లకోట పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జనసేన నాయకుడికి సంజాయిషీ తాఖీదు

పిఠాపురం: పిఠాపురం పట్టణానికి చెందిన జనసేన నాయకుడు పీఎస్ఎస్ మూర్తికి ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సోమవారం రాత్రి సంజాయిషీ తాఖీదు జారీ చేశారు. స్థానిక అర్బన్ బ్యాంకు ఎన్నికల సందర్భంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు మూర్తిపై అభియోగాలున్నాయని అందులో పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారన్నారు. ఎన్నికల్లో పోటీ చేయొద్దని చెప్పినా.. పార్టీ నిర్ణయాన్ని తిరస్కరించి జనసేన బలపరిచినట్లు తప్పుడు ప్రచారం చేసుకున్నారని, పార్టీ పోటీలో నిలిపిన వ్యక్తిని ఓడించేందుకు ప్రయత్నించారన్నారు. దాంతో క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు.

శిక్షణతో ప్రగతి దిశగా పంచాయతీలు



పిఠాపురంలో శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో చిన్నారావు

పిఠాపురం, గొల్లప్రోలు: పంచాయతీలను ప్రగతి దిశగా తీసుకువెళ్లేందుకు పాలకవర్గ సభ్యులు కృషి చేయాలని ఎంపీడీవో చిన్నారావు సూచించారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పంచాయతీల ఆదాయం, ఖర్చు, అభివృద్ధి పనులను వివరించారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, ఖాళీ స్థలాల పన్నులు, కుళాయి పన్నులపైనే పంచాయతీల మనుగడ సాగుతుందన్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, చెత్తనుంచి సంపద, పంచాయతీ సమావేశాల నిర్వహణ గురించి తెలిపారు. ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. ● స్థానిక పరిపాలన సమర్థంగా నిర్వహిస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేసేందుకు రెండురోజుల శిక్షణ తరగతులు ఉపకరిస్తాయని జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు పేర్కొన్నారు. గొల్లప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుసభ్యుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈవోపీఆర్డీ కుమార్, ఎంపీడీవో స్వప్న, రామయ్యదొర, ఆదివిష్ణు పాల్గొన్నారు.

ఒకే యాప్‌గా మార్చండి

పెద్దాపురం: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా మార్పుచేయాలని కోరుతూ పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం సీడీపీవో ఉషకు వినతిపత్రం అందించారు. గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా టీహెచ్‌ఆర్ అందిస్తున్నామని, ఆ మేరకు అయిదు రకాల రికార్డులు రాయాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ఒక్కో కేంద్రం పరిధిలో రూ.1,000 నుంచి రూ.1,200 వ్యయంచేసి రికార్డులు కొనుగోలు చేసి రాయడం భారంగా ఉంటోందన్నారు. 42 రోజుల సమ్మె కాలంలో అంగీకరించినట్లుగా అన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్పుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ అధ్యక్షురాలు జి.బేబీరాణి, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ, వి.ఎస్తేరు రాణి, జి.మహాలక్ష్మి, ఎస్.స్నేహలత, పీవీ పద్మావతి పాల్గొన్నారు.

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కార్యవర్గం

కాజులూరు, న్యూస్‌టుడే: కాజులూరులో సోమవారం నిర్వహించిన మండల మాల మహానాడు సమావేశంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్యవటం సిద్ధార్థ యువజన సంఘం అధ్యక్షుడు పీతల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా నెల్లి బ్రహ్మాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దడాల గంగరాజు ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని 26 గ్రామాల్లో దళితుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండల కమిటీ పెద్దలు మాతా స్వామి, జల్లి సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న దాట్ల

సామర్లకోట: సామర్లకోట అయోధ్యరామపురం సత్తెమ్మతల్లిని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు. పోలినాటి సూర్యచంద్రరావు, బడుగు శ్రీకాంత్, వీరభద్రప్రసాద్, శ్రీనివాసరావు, శివ, వీరబాబు, సీతారామరాజు, సత్యనారాయణ, ఆదినారాయణరెడ్డి తదితరులు వెంట ఉన్నారు.



బుచ్చిబాబును సత్కరించిన నాయకులు

ఎమ్మెల్యే పరామర్శలు

తాళ్లరేవు: తాళ్లరేవు మండలంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాతకోరంగి తెదేపా నాయకుడు కొప్పుల బాలరాజును, పెదబొడ్డువెంటాయపాలెం తెదేపా నాయకుడు పినపోతు సోమరాజును, పాతకోరంగిలో ఇటీవల మృతి చెందిన బత్తుల బాలరాజు కుటుంబ సభ్యులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, దాసరి వేణుగోపాల్, జవ్వాది తాతాజీ పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారికి చెక్ పవర్ అప్పగించాలని వినతి

కరప: గొడ్డటిపాలెంలో చెక్ పవర్‌ను ప్రత్యేకాధికారికి అప్పగించి గ్రామాభివృద్ధికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన పలువురు పంచాయతీ వార్డుసభ్యులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం కరపలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. గొడ్డటిపాలెం సర్పంచిగా సేవలందించిన వాసంశెట్టి శ్రీనుబాబుకు ఉద్యోగం రావడంతో ఇటీవల రాజీనామా చేశారు. ఉప సర్పంచి ఆ బాధ్యత తీసుకునేందుకు వార్డు సభ్యులు అంగీకరించకపోవడంతో ప్రత్యేకాధికారికి చెక్ పవర్ అప్పగించాలని వారు కోరారు. పి.నాగబాబు, గంజా ప్రేమరత్నం, వి.లక్ష్మీదుర్గ, గంజా గోవిందరాజు, వి.సురేష్, సీహెచ్ మణికంఠ, నక్కా గంగాభవానీ, ఎన్.భవానీ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



పెదపూడి: పెదపూడి ఎంపీడీవోగా కె.నరేంద్ర రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన రాయవరం మండలం ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై పెదపూడి మండలానికి వచ్చినట్లు తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

తాళ్లరేవు, న్యూస్‌టుడే: ప్రభుత్వ నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తాళ్లరేవు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. తాళ్లరేవు, కరప, కాజులూరు మండలాలకు సంబంధించి 17 మద్యం దుకాణాలు ఉండగా. .వాటికి ఇప్పటి వరకు 96 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటల లోపు ఆశావహులు దరఖాస్తులు చేసుకోవాలని సీఐ సూచించారు. ఈనెల 11వ తేదీన కాకినాడ కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు.

తహసీల్దారుకు సత్కారం

తాళ్లరేవు: తాళ్లరేవు అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు, తెదేపా శ్రేణులు పినపోతు నాగేశ్వరరావు, పినపోతు వీరబాబు, రేకాడి మహాలక్ష్మి, రత్నాి రాజశేఖర్ సోమవారం తహసీల్దారు పితాని త్రినాథ్‌ను కలిసి సత్కరించారు.

ఎండీయూను ఢీకొట్టిన వ్యాను



ప్రమాదానికి గురైన వాహనం

తాళ్లరేవు: తాళ్లరేవు మండలం 216వ జాతీయ రహదారి కోరింగ వద్ద ఆగి ఉన్న ఎండీయూ వాహనాన్ని అటుగా వెళ్తున్న ఓ వ్యాను ఢీకొట్టింది. ప్రమాదంలో బియ్యం పంపిణీ వాహనం దెబ్బతింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోరంగిలో సోమవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. రేషన్‌కార్డు దారులకు బియ్యం సరఫరా చేసేందుకు రోడ్డు చెంతనే ఎండీయూ వాహనం నిలిపివేసి ఉంది. కాకినాడ నుంచి వస్తున్న ఓ వ్యాను వర్షానికి అదుపు తప్పి ఎండీయూ వాహనంపైకి దూసుకొచ్చింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు.

రెండు టన్నుల చౌక బియ్యం స్వాధీనం

పెద్దాపురం: బి.తాటిపర్తిలో సోమవారం విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన తుమ్మలపల్లి నాగబాబు ఇంట్లో సుమారు రూ.లక్ష విలువైన 41 సంచుల్లోని 2,010 కేజీలు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని అధికారులు నాగ వెంకటరాజు, నవీన్‌కుమార్ పేర్కొన్నారు. కేసు నమోదుచేసి పోలీసులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. దాడుల్లో వలీ, జీవానందం పాల్గొన్నారు.


అక్రమంగా తరలిస్తున్న డీజిల్ పట్టివేత



గోవలంక వద్ద పట్టుకున్న వాహనం

తాళ్లరేవు: యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న డీజిల్ వాహనాలను కోరింగ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. యానాం నుంచి ద్రాక్షారామ వైపు వాహనంలో తరలిస్తున్న 3వేల లీటర్ల డీజిల్‌ను అరటికాయలంక వద్ద, రావుల పాలెం తరలిస్తున్న 2,400 లీటర్ల డీజిల్‌ను గోవలంక వద్ద సోమవారం పట్టుకుని వాహనాలను సీజ్ చేసి, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు కోరింగ ఎస్సై పి. సత్యనారాయణ తెలిపారు. ఎంఎస్‌వో లక్ష్మీప్రసన్న, వీఆర్వోలు శ్రీనివాసరావు, వీరబాబు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి



సంతకాలు చేస్తున్న జయనాగకృష్ణ, సత్యనారాయణ

గొల్లప్రోలు: పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని డైరెక్టర్లుగా నియమితులైన సూరిశెట్టి జయనాగకృష్ణ, బేతా సత్యనారాయణ తెలిపారు. విజయవాడలోని గొల్లపూడి రోడ్డులోగల బీసీ కార్పొరేషన్ భవనంలో జనసేనకు చెందిన జయనాగకృష్ణ(చేబ్రోలు), తెదేపాకు చెందిన సత్యనారాయణ(దుర్గాడ) సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.



పి.రాయవరంలో గాజులతో..



పిఠాపురం: లక్ష్మీదేవి అలంకారం



పెద్దాపురప్పాడులో మహాచండీ



కరపలో జపమాల అలంకరణ



దుర్గాడ శివాలయంలో త్రిశూలధారి



తాటిపర్తిలో స్కందమాత

దైవార్చన.. భక్తజన రక్షణ

సర్పవరం జంక్షన్, పిఠాపురం, కరప, పెద్దాపురం, గొల్లప్రోలు, తాళ్లరేవు: దేవీ నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని దుర్గాదేవి ఆలయాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. రమణయ్యపేటలోని గోకుల్‌గార్డెన్ శ్రీకామాక్షి సమేత ఏకామ్రేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి, తూరంగి శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో మహాచండీదేవి అలంకరణ చేశారు. ● పాదగయ క్షేత్రంలో లక్ష్మీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు దర్శనమిచ్చారు. పురుహూతిక అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఎమ్మెల్యేలు పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈవో విశ్వనాథరాజు వారిని సత్కరించారు. రాపర్తి, పి.రాయవరం గ్రామాల్లో బోనాల సంబరం, అమ్మవారికి గాజులతో పూజలు నిర్వహించారు. పిఠాపురంలోని మహాలక్ష్మీ అమ్మవారు ఇంద్రాణిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● కరప పెద్దాపురప్పాడులోని ఉమాపార్వతిని మహాచండీదేవిగా, కరప రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని జపమాల అవతారంలో అలంకరించారు. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయంతోపాటు అరట్లకట్ట, వేళంగి, గొర్రిపూడి, కొరిపల్లి, గురజనాపల్లి, యండమూరు, కొంగోడు, సిరిపురం, కూరాడ, గురజనాపల్లి గ్రామాల్లో పూజలు చేశారు. ● తాటిపర్తిలోని అపర్ణాదేవిని స్కందమాతగా అలంకరించారు. దుర్గాడ శివాలయంలో త్రిశూలధారిణిగా, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కనకదుర్గమ్మగా అలంకరించారు. కరణంగారితోటలో లక్షపత్రి పూజలు నిర్వహించారు. ● పెద్దాపురం పురపాలిక సెంటర్, సినిమాసెంటర్, వరహాలయ్యపేట, రామారావుపేట, కొండయ్యపేట, కుమ్మరవీధి, బంగారమ్మగుడి వీధి, పాత ప్రభుత్వాసుపత్రివీధి, గణేష్ నగర్‌కాలనీ, బొమ్మలగుడివీధి, వర్జ్యులవారివీధిలోని భువనేశ్వరిపీఠంలో, కట్టమూరుపుంత రహదారిలోని దుర్గమ్మగుళ్ల వద్ద పూజలు నిర్వహించారు. ● తాళ్లరేవు మండలం పాతకోరంగిలో లలితా త్రిపుర సుందరీ దేవి ఆలయ అర్చకులు సాయి ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని గ్రాంటులో లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో పాల కనకదుర్గమ్మ దర్శనమిచ్చారు.



కుక్కుటేశ్వరుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వర్మ, లక్ష్మీదేవి



పిఠాపురం: రాపర్తిలో బోనాలతో భవానీ మాలధారులు



గొల్లప్రోలులో దుర్గమ్మ



గ్రాంటులో..

వాలంటీర్లను కొనసాగించాలని ఆందోళన

గొల్లప్రోలు: ఎన్నికలకు ముందు హామీ మేరకు కూటమి ప్రభుత్వం వాలంటీర్లను కొనసాగిస్తూ నెలకు రూ. 10 వేల చొప్పున వేతనం చెల్లించాలని డిమాండు చేస్తూ గొల్లప్రోలులో సోమవారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు నందేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఏరియా నాయకులు కె.చిన్నా మాట్లాడారు. వేతన బకాయిలు చెల్లించాలని, ప్రభుత్వ కార్యకలాపాల్లో ప్రాధాన్యం కల్పించాలని, వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని డిమాండు చేశారు. ఈ నెల 28న చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వాలంటీర్ల సంఘం మండల నాయకులు ఉమాదేవి, ప్రకాష్, నాగేశ్వరరావు, ధనలక్ష్మి, నీలిమ, రామలక్ష్మి, వెంకటలక్ష్మి, సత్య తదితరులు పాల్గొన్నారు.

బైబిల్ పాఠశాల ప్రారంభం

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బేతేలు ఆరాధన మందిరంలో విరామ బైబిల్ పాఠశాలను సోమవారం పి.జె.తిమోతి ప్రారంభించారు. చిన్నారులకు అభినయ గీతాలు నేర్పించారు. చిత్రలేఖనం, కథలు తదితరాలను వివరించారు. మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని తిమోతి తెలిపారు.



గీతాలాపనలో చిన్నారులు

దారులు ఛిద్రం.. ప్రయాణం నరకం

– న్యూస్‌టుడే, సామర్లకోట

నిత్యం వాహనదారులు రాకపోకలు సాగించే రోడ్లు అధ్వానంగా మారి ప్రయాణం ప్రమాదకరంగా సాగించాల్సిన దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో రోడ్లను పట్టించుకోకపోవడం, కనీసం చిన్నచిన్న గుంతలూ పూడ్చకపోవడంతో రోడ్లు ఛిద్రంగా మారాయి. దాంతో సామర్లకోట పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో రైల్వే పైవంతెన నుంచి కాకినాడ రోడ్డు, వంతెన నుంచి ద్వారపూడి రోడ్డు, రాజానగరం రోడ్లలో రాకపోకలు సాగించాలంటే హడలిపోయే పరిస్థితి. ఈ బాధ పడలేక పలువురు వాహనదారులు కిర్లంపూడి, ప్రత్తిపాడు, జగ్గంపేట, రాజానగరం మీదుగా రాజమహేంద్రవరం, కాకినాడలకు రాకపోకలు సాగిస్తున్నారు. అదనంగా సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం పెరుగుతున్నా రోడ్లు బాగోక ఈ మార్గంలోనే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ద్వారపూడి, కాకినాడ రోడ్లలో వాహనాలు రాకపోకలు సాగించడంతో వాహనాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, ప్రమాదాలకు గురవుతున్నామని, రాత్రి వేళల్లో గుంతల్లోపడి గాయాలపాలవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. స్థానిక హుస్సేన్‌పురం వద్ద పెద్దగుంతలో కర్రకు ఎర్రటి వస్త్రం కట్టి ప్రమాద సూచికగా ఏర్పాటు చేశారు. కనీసం వాహనాలు రాకపోకలు సాగించేందుకైనా గుంతలు పూడ్చి ఇబ్బందిలేకుండా చూడాలని కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు



ప్రమాద సూచికగా ఏర్పాటు చేసిన కర్ర

రూ.20 కోట్లు మంజూరయ్యాయ్..

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఛిద్రమైన రోడ్లు నిర్మించేందుకు ఎమ్మెల్యే చినరాజప్ప చొరవతో రూ.20 కోట్లు మంజూరయ్యాయి. కెనాల్ రోడ్డు, కాకినాడ రోడ్డు నిర్మించేందుకు టెండర్లు పిలిచి త్వరలో పనులు ప్రారంభిస్తాం. దశలవారీగా సామర్లకోట-వేట్లపాలెం రోడ్డు నిర్మించి వాహనదారులకు సౌకర్యం కల్పిస్తాం.

- నర్సయ్య, ర.భ.శాఖ డీఈ కాకినాడ

మహిళలను ఇబ్బంది పెడితే 1098కు కాల్ చేయండి

గండేపల్లి: బాలికలను, యువతులను, మహిళలను ఎవరైనా ఇబ్బందు లకు గురిచేస్తే 1098కు కాల్ చేయండి అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సెలర్ దుర్గారాణి అన్నారు. సోమవారం గండేపల్లి మండలం మురారి గ్రామంలో జెడ్పీ బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా మహిళలకు అవగాహన కల్పించారు. బాల బాలికలకు బాలల హక్కులు, లైంగిక వేధింపులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఎస్ఎస్ వెంకటలక్ష్మి, సిబ్బంది కరుణకుమారి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

టెట్ పరీక్షకు 375 మంది హాజరు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన ఏపీటెట్ పరీక్షకు మొత్తం 442 మందికి గాను 375 మంది అభ్యర్థులు హాజరయ్యారని ప్రొవెన్లర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

తుని

•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

భక్తిశ్రద్ధలతో పడిపూజ

గండేపల్లి: గండేపల్లి కృష్ణుని ఆలయం వద్ద ఆదివారం రాత్రి భవానీలు పడి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో 500 మంది భవానీలు పాల్గొని అమ్మవారి పాటలు ఆలపించారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని పాతబజారులో ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం సామూహిక లక్ష పుష్పార్చన, కల్యాణం ఘనంగా జరిగింది. మోహిని అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

మహా చండీదేవిగా అమ్మవారు



అరుణాచలేశ్వర క్షేత్రంలో ఉపాలయంలో మహిళల పారాయణ



తపోవనం: లలితాహోమం చేస్తున్న వేదపండితులు

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం అభయదుర్గాదేవి అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి పూజలు చేశారు. తుని పట్టణం చిట్టా రీస్ మెట్ట ప్రాంగణం శ్రీవరదమహాలక్ష్మీ అమ్మవారు అత్యంత శుద్ధ పంచమి సందర్భంగా శ్రీధనలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ● రౌతులపూడి మండలం ములగపూడి, ఎస్.ఎస్.పట్నం, శృంగవరం, పి.చామవరం, పారుపాక, ఎస్.అగ్రహారం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ● అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల కల్యాణ గౌరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ● సీతంపేటలోని దుర్గామీనాక్షి అమ్మవారు భక్తులకు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. కత్తిపూడి కనకదుర్గమ్మ అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. ● జగపతినగరంలో అమ్మవారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అష్టలక్ష్మీపూర్వక చండీహోమం నిర్వహించారు. కిర్లంపూడి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మహాచండీగా అలంకరించారు. ● జగ్గంపేట రాజుపల్లి శ్రీఅరుణాచలేశ్వర స్వామి క్షేత్రంలో అభిత కుచాంబ అమ్మవారు మహాచండీ దేవిగా దర్శనమిచ్చారు. ● లింగంపర్తి సత్యం పంపుల కాలనీ వద్ద ఉన్న దుర్గమ్మ ఆలయంలో ఏకాహ మహోత్సవాన్ని నిర్వహించారు. గుర్రం వీరబాబు, ఆలమూరి సుబ్బలక్ష్మి, వడ్లమూడి తమ్మయ్య బాబు తదితరులు పాల్గొన్నారు. ● తపోవనం ఆశ్రమంలో చర్తుకుల లలితాహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ పర్యవేక్షణలో హోమం చేశారు. ● జగ్గంపేటలో అమ్మవారు లలితాసుందరీదేవిగా దర్శనమిచ్చారు. గండేపల్లిలో ఎన్‌హెచ్ పక్కన ఉన్న దుర్గమ్మ ఆలయంలో మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● జె. కొత్తూరులో అమ్మవారిని మహాచండీగా అలంకరించి పూజలు చేశారు.

- న్యూస్‌టుడే, తుని పట్టణం, అన్నవరం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం, ఏలేశ్వరం, తుని గ్రామీణం, గండేపల్లి(జగ్గంపేట), జగ్గంపేట గ్రామీణం



అన్నవరం: వనదుర్గ అమ్మవారు



తునిలో ధనలక్ష్మీదేవిగా..



జగ్గంపేటలో లలితాత్రిపుర సుందరిదేవి



మహాచండిగా అభిత కుచాంబ అమ్మవారు



జగపతినగరంలోని అభయదుర్గాదేవి..



రౌతులపూడిలో..



సీతంపేటలో..

శిక్షణ తరగతులు

రౌతులపూడి: రౌతులపూడి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఎంపీడీవో శివరామకృష్ణయ్య, పంచాయతీ విస్తరణాధికారి శ్రీరామచంద్రమూర్తి శిక్షణ నిర్వహించారు. ఉపసర్పంచులు, వార్డు సభ్యులు హాజరయ్యారు.

వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి

ఏలేశ్వరం: దసరా సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్రీను సూచించారు. పాఠశాలలో 'పది' విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వృత్తి విద్య శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం పది రోజుల ఇంటర్న్‌షిప్‌లో భాగంగా సోలార్ కంపెనీ డబ్ల్ గ్రేడర్ కంపెనీ లిమిటెడ్ సంస్థలో కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. వృత్తి విద్య శిక్షకులు శివాజీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన

ఏలేశ్వరం: అకారణంగా సస్పెండ్ చేసిన ఏలేశ్వరం డిపో కండక్టర్ ఎస్.శ్రీనివాసరావుని విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పులి జార్జిబాబు సూచించారు. కండక్టర్ సస్పెన్షన్‌ని వ్యతిరేకిస్తూ స్థానిక ఆర్టీసీ ఐకాస నాయకులు నిర్వహించిన దీక్షా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఐకాస నాయకులు యూబీఎం కుమార్, కె.త్రిమూర్తులు మాట్లాడుతూ ఉద్యమ కార్యాచరణను వివరించారు. నాలుగో రోజు దీక్షల్లో కె. ప్రవీణ్, ఆర్.శ్రీను, వి.లోవరాజు కూర్చున్నారు.

'వాలంటీర్లకు న్యాయం చేయండి..'

తుని: ప్రభుత్వం వార్డు వాలంటీర్లకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు గొర్ల వెంకటరమణ, నక్కెళ్ల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని రాజా క్రీడామైదానంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై వాలంటీర్లతో చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి గతంలో ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లకు రూ.10 వేలు వేతనం చెల్లించాలన్నారు. ఇప్పటికే బకాయిపడ్డ నాలుగు నెలల వేతనం తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27న కాకినాడలో చేపట్టే ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం పురవీధుల్లో ప్రదర్శన చేపట్టి పురపాలక అధికారులు, తహసీల్దారుకు వినతిపత్రాలు అందించారు.

శంఖవరం ఏపీఎంగా శ్రీనివాసరావు

శంఖవరం, న్యూస్‌టుడే: శంఖవరం ఏపీఎంగా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డ్వాక్రా సంఘాల అభివృద్ధికి నూతన పద్ధతులతో కృషి చేస్తానన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

గండేపల్లి(జగ్గంపేట): కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని దానికి నిదర్శనం ఈరోజు దివ్యాంగులకు అందించే ఈ ఉపకరణాలే సాక్ష్యం అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం జగ్గంపేట పాతపోలీస్‌స్టేషన్ ఆవరణలో కేంద్రప్రభుత్వ సహకారంతో అలిమ్కోసంస్థ అందించే ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అందజేశారు. అలిమ్కో సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 3న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం ఏర్పాటు చేసి, అక్టోబర్ 7న అర్హులకు అందజేశామని అన్నారు. జగ్గంపేటలో వృత్తి విద్యాశిక్షణా నైపుణ్య కేంద్రం ఏర్పాటు చేయాలని దానికి కావాల్సిన వసతులు నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందిస్తామన్నారు. 356 మంది దివ్యాంగులకు 550 బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్ ఛైర్లు, వినికిడి యంత్రాలు, కృత్రిమ కాళ్లు, సంకకర్రలు తదితర ఉపకరణాలు అందజేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు లక్ష్మణరావు, పెద్దిరెడ్డి, నాయకులు కోర్పు లచ్చయ్యదొర, అప్పలరాజు, భద్రం, అప్పన్నదొర, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

ఇసుక స్టాక్ పాయింట్ పరిశీలన

గండేపల్లి: పి.నాయకంపల్లి గ్రామ శివారు 327 సర్వేనంబరులో బీఎస్ఆర్ కంపెనీకు సంబంధించిన ఇసుక స్టాక్‌పాయింట్‌ను సోమవారం జిల్లా మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ సత్యతేజ పరిశీలించారు. ఇక్కడ 52వేల 300 క్యూబిక్‌మీటర్ల ఇసుక స్టాక్ పాయింట్ నుంచి అక్రమంగా బయటకు వెళ్తుందనే ఆరోపణలపై తనిఖీ చేశామన్నారు. దీనిపై బీఎస్ఆర్ కంపెనీ నుంచి సేకరించిన వివరాల ప్రకారం 2018 సంవత్సరంలో రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకున్నారని ఈ ఇసుక 70 సెంట్లలో ఉందని, కల్వర్టులు, డివైడర్ పనులకు వాడుతున్నట్లు కంపెనీ తెలియజేసిందన్నారు. పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతామన్నారు. గండేపల్లి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు భవనాలు ఎప్పటికో..!

శంఖవరం, రౌతులపూడి, న్యూస్‌టుడే: గ్రామస్థాయి పాలనకు వేదికైన పంచాయతీలకు భవనాల కొరత వేధిస్తోంది. గ్రామస్థాయి పాలనను సచివాలయాల ద్వారా చేసి గత ప్రభుత్వం పంచాయతీలను నిర్లక్ష్యం చేసింది. శంఖవరం, రౌతులపూడి మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీలకు సొంత భవనం లేని దుస్థితి.



ములగపూడిలో అసంపూర్తిగా పనులు ఆగాయి ఇలా..



అచ్చంపేటలో రామాలయం వద్ద గ్రామసభ (పాతచిత్రం)

కట్టడాల ఊసే లేదు

శంఖవరం మండలంలో సీతంపేట, అచ్చంపేట, రౌతులపూడి మండలంలో ఎం.చామవరం, కోడూరు, మల్లంపేట, బీబీపట్నం, ఉప్పంపాలెం, ధారజగన్నాథపురం గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటుచేస్తూ గెజిట్ విడుదలైంది. స్థానిక ఎన్నికల అనంతరం పాలకవర్గాలు ఏర్పడ్డాయి. సొంత భవనాల ఏర్పాటు పనులు నేటికీ పట్టాలెక్కలేదు.

నిలిచిన నిర్మాణాలు..

రౌతులపూడి మండలంలో రాఘవపట్నం, ములగపూడి పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణం చేపట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో అవి తుప్పల మధ్యలో ఉన్నాయి. బలరాంపురంలో పంచాయతీ భవన స్థానంలో సచివాలయాన్ని నిర్మించారు. రౌతులపూడి పంచాయతీ కార్యాలయంలో పోలీస్‌స్టేషన్ నిర్వహిస్తున్నారు. రౌతులపూడి మండలంలో గంగవరం,లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం, ఎస్.ఎస్.పట్నం, శంఖవరం మండలంలో ఎస్.జగ్గంపేట, శంఖవరం, వేళంగి, గవిరంపేట పంచాయతీ భవనాలు శిథిలస్థితిలో ఉన్నాయి. పంచాయతీలకు సొంత భవనాలు లేక గ్రామసభలు, సమావేశాలకు పాట్లు తప్పడం లేదు. అధికార యంత్రాంగం పంచాయతీలకు భవనాలు సమకూర్చాలని సర్వత్రా కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి

ములగపూడి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణం మధ్యలో నిలిచింది. అద్దెకు భవనం తీసుకుంటే పంచాయతీకి ఆర్థిక భారమవుతుంది. నిలిచిన నిర్మాణానికి నిధులు కేటాయించి భవనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నా.

- తమరాల సత్యనారాయణ, తెదేపా మండలాధ్యక్షుడు, సర్పంచి, ములగపూడి

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

రౌతులపూడి మండలంలో పంచాయతీల పరిస్థితిని ఎమ్మెల్యే సత్యప్రభ ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

- జి.శివరామకృష్ణయ్య, ఎంపీడీవో, రౌతులపూడి

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదు..

నర్సింగ్ విద్యార్థినుల ఆవేదన

న్యూస్‌టుడే, కావలి: 'పరీక్షలకు ముందు హాల్‌టికెట్ల జారీలో జాప్యంపై ఆందోళన చేశామని కళాశాల యాజమాన్యం మాపై కక్ష కట్టింది. ఇంటర్నల్ మార్కులు తగ్గించారు. ఇప్పుడు కోర్సు పూర్తయినా ధ్రువపత్రాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వస్తున్నా.. చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. మీరైనా తగిన చర్యలు తీసుకోండి' అంటూ శ్రీకాకుళం, తుని తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు వాపోయారు. కావలి పట్టణంలోని ఓ నర్సింగ్ కళాశాలలో చదివిన వీరంతా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో వంశీకృష్ణకు మొరపెట్టుకున్నారు. దాంతో ఆయన తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజితను ఆదేశించగా.. ఆమె కళాశాల నిర్వాహకులతో చర్చిస్తున్నారు. ఇక్కడ చదువుకున్న యువతులకు తప్పక న్యాయం చేస్తామని, వారి ధ్రువీకరణ పత్రాలు తిరిగి వారి చేతికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



యువతులతో చర్చిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

తుని ఎంపీడీవోగా సాయి నవీన్‌కుమార్

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తుని మండల ఎంపీడీవోగా సాయి నవీన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

గ్రామ పరిపాలనపై అవగాహన..

పరిపాలనపై అవగాహన కలిగి ఉన్నప్పుడే గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించగలమని ఎంపీడీవో సాయి నవీన్‌కుమార్ సూచించారు. సోమవారం సర్పంచులు, ఉపసర్పంచులకు 'గ్రామ పరిపాలన విధానం' పై సదస్సు నిర్వహించారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు సోమవారం జరిగాయి. ఎంపీపీ కాంతి సుధాకర్, ఎంపీడీవో కుమార్ బాబులు పంచాయతీల్లో సాధారణ పరిపాలనపై అవగాహన కల్పించారు.

ఏలేశ్వరం: దేశానికి గ్రామాలే వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. పంచాయతీల్లో సాధారణ పరిపాలన విధానంపై ఉపసర్పంచి, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వాలు పల్లెల ప్రగతికి ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయి. అవకాశాలను అందిపుచ్చుకుని గ్రామ స్వరాజ్యం సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు.

లక్ష్యం దిశగా.. ముందుకు..!

యువ క్రీడాకారుల జోరు

న్యూస్‌టుడే, తొండంగి: గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు మండల, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి శెభాష్ అనిపించుకుంటున్నారు. ఒకవైపు చదువు, ఖాళీ సమయాల్లో క్రీడల్లో శిక్షణ పొందుతూ రాణిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నా రోజూ సాధన చేస్తున్నారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల్లో మండల, జిల్లా స్థాయిలో రాణించి అయిదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తొండంగి మండలం రావికంపాడు ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినిలు ఎస్.హనీష, వి.జి.అపర్ణ, కస్తూర్బా విద్యాలయం ఎనిమిదో తరగతి విద్యార్థిని వై.గ్లోరి టెన్నీకాయిట్ , బెండపూడి ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు హాకీ క్రీడల్లో ప్రతిభ చూపారు. త్వరలో వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఆడనున్నారు.

జాతీయస్థాయిలో ఆడటమే..



వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్ రాజు ఇచ్చే శిక్షణ హెచ్‌ఎం కృష్ణమూర్తి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. రోజూ రెండు గంటల పాటు హాకీలో శిక్షణ పొందుతున్నా. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి జాతీయస్థాయిలో ఆడడమే లక్ష్యం.

– దార్ల హరీష్, తొమ్మిదో తరగతి, బెండపూడి ఉన్నత పాఠశాల

ఉద్యోగం సాధించడమే..



రోజూ రెండు గంటలు హాకీలో శిక్షణ పొందుతున్నా. ప్రస్తుతం జరగబోయే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికవడం లక్ష్యం. భవిష్యత్తులో చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి మంచి ఉద్యోగం సాధించే దిశగా ముందుకు సాగుతున్నా.

– వై.రాకేష్‌కుమార్, ఏడో తరగతి, బెండపూడి ఉన్నత పాఠశాల

ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న తుమ్మలపల్లి

గండేపల్లి(జగ్గంపేట): సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా తోట సుధీర్ సోమవారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. జగ్గంపేట జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై సుధీర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వీరబాబు, ప్రసాద్, మణికంఠ, బాబి పాల్గొన్నారు.



సుధీర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్

సమస్యలు పరిష్కరించాలని వినతి



తుని పట్టణం: కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు మొరపెట్టుకున్నారు. బ్యాంకు కాలనీలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద యూనియన్ అధ్యక్షురాలు వై.ధనలక్ష్మీ, కార్యదర్శి బి.మేరీ, కోశాధికారి సుబ్బలక్ష్మీ మాట్లాడుతూ.. తక్షణం అద్దె బకాయిలు చెల్లించాలన్నారు. యాప్‌లను తగ్గించాలని, కొత్త ఫోన్లు, ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. సీడీపీవో కె.శ్రీలతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సెక్టార్ నాయకులు ఉన్నారు.

జోరుగా వాన.. ఎండ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలంలో సోమవారం ఎండ, వర్షం పోటీ పడ్డాయి. రోజంతా ఇదే వాతావరణం కొనసాగడంతో జన సంచారానికి ఇబ్బంది అయింది. ఉన్నపళంగా భారీ జల్లులు కురవడం వీధులు, రహదారులు జలమయమయ్యాయి. ప్రత్తిపాడులో కార్యాలయాలన్నీ ఒకే ఆవరణలో ఉండగా ప్రవేశద్వారంలో వర్షం నీరు నిలిచింది. సందర్శకులు ఇబ్బంది పడ్డారు. అగ్నిమాపక కేంద్రం ముందు, సమీప కాలనీ ముందు నీళ్లు నిలిచాయి. ర.భ.రహదారి వెంబడి కాలువలు ఆక్రమణలకు గురవ్వడం, తూర వంతెన మూసుకు పోవడంతో అగ్నిమాపక కేంద్ర పరిసరాల్లో నీరు ఎండకు ఇంకే వరకు అలా నిలుస్తుంది.



వర్షంతో జలమయమైన రహదారులు

పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై ఆరోపణ

గండేపల్లి: గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ కొందరు గ్రామస్థులు ఆరోపిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జనసేన నాయకులు సత్తిసోమరాజు, మేడిబోయిన శ్రీనులు మాట్లాడుతూ ఉపాధి నిధులు గాంధీ జయంతి రోజున ఈ గ్రామ స్వరాజ్ అనే వెబ్‌సైట్ నుంచి వివరాలు సేకరించగా పనులు చేయకుండా సర్పంచి, పంచాయతీ కార్యదర్శి డబ్బులు తీసేసుకుంటున్నారని ఆరోపించారు. జనవరి నుంచి క్లీన్ ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా క్లాప్ మిత్రకు నెలకు 5వేలు ఇస్తూ 52వేల రూపాయలు అదనంగా కాజేశారని ఆరోపించారు. పంచాయతీలో శానిటేషన్, జల్‌జీవన్ మిషన్, చెత్తను ఎత్తడం, ప్రాసెస్ చేస్తున్నట్లు రామకుర్తి కుందరాజు అనే పేరుమీదుగా 2024 సెప్టెంబర్ 10న 29వేల రూపాయలు డ్రా చేశారని, మే నెలలో మూడు లక్షల రూపాయలు, గడిచిన 18నెలల్లో 12 లక్షలు రూపాయలు డ్రా చేసి కాజేశారని ఆరోపించారు. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తెదేపా నాయకులు అడబాల సత్యనారాయణ, జనసేన నాయకులు మేడిబోయిన శ్రీను, ఎన్. వెంకటరమణ పాల్గొన్నారు.

ఖర్చుల వివరాలు వెల్లడించాలి

కిర్లంపూడి: కిర్లంపూడి మండల పరిషత్ ద్వారా ప్రస్తుత పాలకవర్గం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు నిధులు ఏమేరకు వచ్చాయి, వాటి ఖర్చుల వివరాలు వెల్లడించాలని మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ, ఇతర ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఈ సమావేశం ఎంపీపీ తోట రవి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పలు అంశాలపై లేవనెత్తిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉండగా పలువురు అధికారులు సమావేశానికి హాజరుకాలేదు. బూరుగుపూడి, తామరాడ మీదుగా ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, భూపాలపట్నం నుంచి కాకినాడకు ఏలేశ్వరం ఆర్టీసీ డిపో నుంచి బస్సును నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆయాగ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీడీవో సి.హరికృష్ణ హామీ ఇచ్చారు. తోట గాంధీ పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

ప్రత్తిపాడు: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. ప్రత్తిపాడు ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి నమోదు ప్రక్రియ సోమవారం చేపట్టారు. ప్రతి గ్రామంలోనూ పార్టీ బలోపేతానికి సమష్టి కృషి జరుగుతోందన్నారు. భాజపా నాయకులు ఆయన వెంట ఉన్నారు.

వంతాడలో వైద్య శిబిరం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: వంతాడలో పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యశస్వి వైద్యశిబిరం నిర్వహించారు. 80 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. సిబ్బంది రామిశెట్టి రాంబాబు తదితరులు శిబిరంలో సేవలందించారు.

సారా విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

తుని: మండలంలోని లోవకొత్తూరుకు చెందిన లోవరాజు అనే వ్యక్తి పట్టణంలో పది లీటర్ల సారాయిని విక్రయించేందుకు తీసుకువస్తుండగా అరెస్టు చేశామని సీఐ ఎం.గీతా రామకృష్ణ తెలిపారు.

కారును ఢీకొట్టిన ట్రాలీ లారీ

తొండంగి: ఎన్‌హెచ్‌పై సోమవారం ట్రాలీ లారీ కారును ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలివీ.. విశాఖపట్టణం నుంచి అన్నవరం వెళ్తున్న కారును రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్టణం వెళ్తున్న లారీ అన్నవరం ఆర్చి వద్ద ఢీ కొట్టింది దీంతో కారు అదుపు తప్పి విభాగినిపైకి దూసుకెళ్లింది. దాంతో కారు ముందు భాగం దెబ్బతింది. లారీ అదుపుతప్పి ఎన్‌హెచ్ పక్కనే ఉన్న తుప్పల్లోకి దూసుకెళ్లి నిలిచింది. ఈఘటనలో రెండు వాహనాలు ప్రమాదస్థలం సమీపంలో నిలిచిఉండడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అవి బోల్తా పడితే ప్రాణనష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఎద్దులు స్వాధీనం

చాగల్లు, కొవ్వూరు పట్టణం: నిబంధనలకు విరుద్ధంగా 29 ఎద్దులను తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. సీఐ విశ్వం తెలిపిన వివరాలివీ..జగ్గంపేట నుంచి హనుమాన్ జంక్షన్‌కు ఎద్దులతో వెళుతున్న లారీని సోమవారం గుర్తించి గోశాలకు తరలించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.


మెట్టలో పూల పరిమళాలు

న్యూస్‌టుడే, తుని గ్రామీణం

మెట్ట ప్రాంత రైతులు సంప్రదాయ వ్యవసాయానికి బదులు వాణిజ్య పంటలు, అందులోనూ పూల సాగుపై దృష్టి సారించడం విశేషం. బంతి, చామంతి, కనకాంబరం, కాడమల్లి, గులాబి, మల్లి తదితరాల సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. తుని నియోజకవర్గం తేటగుంట, లోవకొత్తూరు, రేఖవానిపాలెం, నందిఒంపు, బొద్దవరం, తొండంగి గ్రామాల్లో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో పూల సాగు చేపట్టడంతో మెట్టలో సువాసనలు గుప్పుమంటున్నాయి.

అ'ధర'హో..

ప్రస్తుతం చేతికొచ్చిన బంతి, చామంతి, కనకాంబరం తదితరాలకు డిమాండ్ బాగుంది. గతంలో కిలో ధర సుమారు రూ. 60- 80 మధ్య ఉండేది. ప్రస్తుతం పూల రకాన్ని బట్టి ధర కిలోకు రూ.100- 200 వరకు పలుకుతుంది. అయితే ఇటీవల వర్షాలకు పూల మొక్కలు నేలవాలడంతో పూలు కుళ్లి దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రెండు మూడు రోజుల్లో సుమారు 50 నుంచి 80 కిలోల పూల ఉత్పత్తులు వస్తుండగా ప్రస్తుతం వీటి దిగుబడి అధిక వర్షాలతో మొక్కలు చనిపోవడంతో తగ్గిపోయిందని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలతో పూలమొక్కలు నేలవాలాయి. దీంతో దిగుబడి తగ్గుతుంది. మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉన్నప్పటికి ప్రతికూల వాతావరణం నెలకొనడంతో పూల సాగు చేసే రైతులకు సంబంధిత అధికారులు నష్టం నుంచి గట్టెక్కే సూచనలివ్వాలని కోరుతున్నారు.



సుభద్రయ్యమ్మపేటలో బంతిపూల సాగు (అంతర చిత్రం) వర్షాలకు నేలవాలిన మొక్క

తోటల్లో నీళ్లు నిల్వ ఉంచొద్దు..

పూల తోటల్లో అధికంగా నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పూలసాగు ప్రారంభంలోనే మొక్కల మధ్య సమాంతర దూరం ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకొని అధిక నీరు బయటకు వెళ్లే విధంగా చిన్న చిన్న కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. ఇతర సమస్యలు ఉంటే సమీపంలోని సచివాలయ ఉద్యానశాఖ అధికారులకు తెలియజేస్తే తగు సూచనలిస్తారు. ప్రభుత్వ రాయితీలు వివరిస్తారు.

– విజయలక్ష్మి, ఉద్యానశాఖ అధికారిణి, తుని మండలం